జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 04 సెప్టెంబర్ 2026 | సంపుటి: 22 | సంచిక: 178 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 08:53:17 వరకు నక్షత్రంరేవతి - 27:24:42 వరకు కరణంవిష్టి - 08:53:17 వరకు, బవ - 20:21:24 వరకు పక్షంకృష్ణ యోగంగణ్డ - 25:50:48 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## జన్మతః పౌరసత్వ ఆంక్షల ఆదేశాలు నిలిపివేత

**సుప్రీంకోర్టులోనూ ట్రంప్‌నకు ఎదురుదెబ్బ**

**పౌరసత్వ కొత్త విధానానికి కోర్టు బ్రేకులు**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3(ప్రజాజ్యోతి): జన్మతః పౌరసత్వంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరోసారి న్యాయస్థానంలో చుక్కెదురైంది. అమెరికాలో జన్మించే విదేశీ వలసదారుల పిల్లలకు

మిగతా 2లో..

## నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరట

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3(ప్రజాజ్యోతి): న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్ (బీసీఐ)కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరటనిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బీసీఐ అధికార పరిధి కేవలం న్యాయవాదులుగా నమోదైన

మిగతా 2లో..

# కొండా సురేఖ బర్తరఫ్

- మంత్రివర్గం నుంచి ఉద్వాసన
- రాజీనామాకు నిరాకరించిన సురేఖ
- బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
- గవర్నర్ కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ
- సీఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు





హైదరాబాద్,సెప్టెంబర్3(ప్రజాజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో పరిపాలనాపరమైన,

మిగతా 2లో..

**కొండా సురేఖ పై వేటు పడింది. మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేసారు. ఈ మేరకు సీఎం రేవంత్ గవర్నర్ కు సిఫారసు లేఖ పంపారు. కుమార్తె సుస్మిత వ్యాఖ్యల తరువాత కొండా సురేఖ కేంద్రంగా కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. తాజాగా ఢిల్లీలో పార్టీ నాయకత్వంతో నూ కొండా సురేఖ చర్చలు చేసారు. అయితే, రేవంత్ కోరిన విధంగా హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక.. ఇప్పుడు కొండా సురేఖ పార్టీ వీడటం.. తదుపరి నిర్ణయం ఆసక్తి కరంగా మారింది.**

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆందోళన..

**తెలంగాణ సచివాలయం ముట్టడించిన బీజేపీ**



హైదరాబాద్,సెప్టెంబర్3(ప్రజాజ్యోతి): తెలంగాణలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య తీవ్ర రూపం దాల్చింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు సెప్టెంబర్ 3, 2026న సచివాలయం వైపు వెళ్లి 8 లక్షల మంది విద్యార్థుల సంతకాలతో కూడిన లేఖలను అందించేందుకు ప్రయత్నించారు. గతంలో హెచ్చరికలు, నిరాహార దీక్షల తర్వాత ఈ చర్య జరిగింది. పార్టీ అధికారిక అకౌంట్ ప్రకారం ఆయన ఈ లేఖలను ప్రభుత్వానికి నేరుగా అందించాలని సచివాలయం వైపు కదిలారు. రామచందర్ రావు తమ స్టేట్‌మెంట్‌లో ఓ విషయం స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిందనీ, రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగాలకు అవకాశం కోల్పోతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై ఇటీవల ఆయన రెండు రోజులు నిరాహార దీక్ష చేశారు, ముఖ్యమంత్రికి లేఖలు రాశారు, విద్యార్థుల నుంచి 8 లక్షల సంతకాలు సేకరించారు. అయినా ప్రభుత్వం స్పందించలేదని, అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని చెప్పి సచివాలయంలోకి

మిగతా 12లో..

## నన్ను తొలగించడం కుట్రే..

- రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు
- బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు
- కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటా.. నేను పార్టీ మారను
- నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని
- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు
- బీసీ మహిళా మంత్రిగా అణచివేతకు గురయ్యా
- నిర్ణయంపై రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- బర్తరఫ్ పై మీడియా సమావేశంలో కొండా సురేఖ
- అధిష్టానానికి పంపిన లేఖ కొండా సురేఖ రిలీజ్



హైదరాబాద్,సెప్టెంబర్3(ప్రజాజ్యోతి): మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే.. తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. ఈ సందర్భంగా టీవీ9తో మాట్లాడిన సురేఖ పలు కీలక విషయాలను వెల్లడించారు. తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ కూడా తీసుకోలేదని, రాజీనామా చేయాలని కూడా ఎవరూ చెప్పలేదన్నారు. అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకుని ఉండాల్సిందని అన్నారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి

మిగతా 2లో..

## చట్టబద్ధతోనే దత్తత ప్రక్రియ

**అక్రమ దత్తతకు వీలులేదు**

**రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు**



హైదరాబాద్,సెప్టెంబర్3(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో బాలల సంరక్షణ కేంద్రాలు, సంక్షేమం, పునరావాసానికి సంబంధించిన వ్యవస్థల పనితీరుకు సంబంధించిన వివరాలపై హైకోర్టు బుధవారం ఆరా తీసింది. అక్రమ దత్తతకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా చట్టబద్ధ దత్తత ప్రక్రియ తప్పనిసరని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. 2 మాసాల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులు అక్రమ దత్తతకు గురైనట్లుగా ఆరోపణలతోపాటు నమోదైన ఎఫ్ఐఆర్‌లలో అసలైన

మిగతా 2లో..

## కేబినేట్ లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

- సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్
- ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద
- కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్

**బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం**

2 లో



## దేశభక్తి విషయంలో అందరూ ఒక్కటే

- రాజకీయ సిద్ధాంతాలు వేర్వేరుగా ఉండొవచ్చు
- దేశభక్తిలో మోదీ, అమిత్‌షాల కంటే ఒవైసీ మేటి
- కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- ఒవైసీని ఒక్క మాట అన్నా నేను సహించబోను
- సింధూర్ సమయంలో ఒవైసీ మద్దతుగా నిలిచారు
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు**
- సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రాంభించిన సీఎం
- పాతబస్తీ మెట్రోను పూర్తి చేసి చూపిస్తామని చెప్పాం
- **మీరాలం ట్యాంక్‌పై కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం**

హైదరాబాద్,సెప్టెంబర్3(ప్రజాజ్యోతి): హైదరాబాద్ నగరంలో మరో కీలక మౌలిక వసతి సదుపాయం అందుబాటులోకి వచ్చింది. చంచల్‌గూడ--సంతోష్‌నగర్ ప్రాంతాలను కలుపుతూ నిర్మించిన సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. మొత్తం 3.25 కిలోమీటర్ల పొడవున రూ.625 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ నాలుగు లేన్ల స్టీల్ బ్రిడ్జి గురువారం నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. చంచల్‌గూడ జైలు నుంచి యాదగిరి థియేటర్ వరకు నిర్మించిన ఈ ఫ్లైఓవర్ వల్ల మలక్‌పేట, సంతోష్‌నగర్, సైదాబాద్, కంచన్‌బాగ్, చంచల్‌గూడ ప్రాంతాల్లో తరచూ ఎదురయ్యే ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో వాహనదారులకు ఈ వంతెన ఎంతో ఉపయోగకరంగా మారనుంది. సాధారణంగా 40 నిమిషాలు పట్టే ప్రయాణం ఈ ఫ్లైఓవర్ ద్వారా దాదాపు 15 నిమిషాల్లో పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఓల్డ్ సీటీ అభివృద్ధి, ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో తన ప్రభుత్వ సంబంధాలపై

మిగతా 2లో..



## భారత ఆర్థిక వృద్ధి వల్ల ప్రపంచానికి కొత్త అవకాశాలు

- భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మధ్య చర్చలు
- భారత్, బెల్జియం మధ్య పలు కీలక ఒప్పందాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3(ప్రజాజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్న వేళ భారత్, బెల్జియం ద్వైపాక్షిక సంబంధాలను మరింత వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మధ్య గురువారం విస్తృత చర్చలు జరిగాయి. అందులో వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాలు, క్లీన్ ఎనర్జీ, అధునాతన సాంకేతికత వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ ప్రపంచ

మిగతా 12లో..

## భీమ్‌రెడ్డిపై ఈడీ మనీలాండరింగ్ కేసు

- బీనామీల పేర్లతో 20కి పైగా చర, స్థిరాస్తులు
- పలు ప్రాంతాల్లో భారీగా బినామీ ఆస్తులు
- పక్కా ఆధారాలు సేకరిస్తున్న అధికారులు

హైదరాబాద్,సెప్టెంబర్3(ప్రజాజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సస్పెన్షన్‌కు గురైన డీఎస్పీ భీమ్‌రెడ్డిపై, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించింది. అక్రమ ఆస్తులను కూడబెట్టిన కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు గతనెల 6న డీఎస్పీ భీమ్‌రెడ్డిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ అరెస్ట్ అనంతరం ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో కీలకమైన అస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. భీమ్‌రెడ్డి విధి నిర్వహణలో ఉండగా అక్రమ మార్గాల్లో దాదాపు రూ.150 కోట్ల విలువైన ఆస్తులను సంపాదించుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆయనతో పాటు బీనామీల పేర్లుతో 20కి పైగా చర, స్థిరాస్తులు కల్గి ఉన్నట్లు అధికారులు గుర్తించారు.భీమ్‌రెడ్డి సంపాదించిన ఈ భారీ అస్తులు కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా పలు ప్రాంతాల్లో విస్తరించి ఉన్నట్లు తేల్చారు. మణికొండ, గచ్చిబౌలి, తెల్లాపూర్, పటాన్‌చెరు, నాగోలు, మోమిన్‌పేట్, జహీరాబాద్, కర్ణాటకలోని బెంగళూరులోనూ ఖరీదైన ఆస్తులను గుర్తించారు. ఈ ఆస్తుల్లో సింహభాగం నేరుగా ఆయన పేరు మీద కాకుండా బినామీల పేర్లపై కొనుగోలు చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది.

మిగతా 2లో..

# సంపాదకీయం

## కూతురి రాజకీయ భవితవ్యం కోసమే!

నేడు రాష్ట్ర రాజకీయాలు కొండా ఫ్యామిలీ చుట్టూ తిరుగుతున్నాయి. ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో.. అధిష్టానం ఎటువైపుగా అడుగులు వేస్తుందో అని ఉత్కంటగా ఎదురు చూస్తున్నారు. కానీ కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొండా సురేఖ రాజీనామా వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. కొండా సురేఖ మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని, లేదంటే పార్టీ నుండి బర్తరఫ్ చేస్తామని పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేయటంతో కొండా కపుల్ రాజకీయ భవితవ్యం గందరగోళంలో పడింది. కూతురు చేసిన వ్యాఖ్యలు కొండా సురేఖ రాజకీయ జీవితాన్ని మార్చేస్తుంది అన్న చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. చాలా కాలంగా కొండా కపుల్ తమ కుమార్తె పొలిటికల్ ఎంట్రీ కోసం ప్రయత్నం చేస్తున్నారు. గతంలోనూ బీఆర్ఎస్ లో ఉన్న సమయంలో కూడా కొండా సుస్మితకు టికెట్ కావాలని అధిష్టానం మీద ఒత్తిడి తెచ్చారు. కొండా సుస్మిత తన తల్లిదండ్రుల రాజకీయ వారసత్వాన్ని కొనసాగించాలనే ఆలోచనతో పరకాల నియోజకవర్గంపై గంపెడు ఆశలు పెట్టుకుంది. అయితే ఇటీవల సీఎం రేవంత్ పరకాలలో మళ్ళీ టికెట్ రేవూరి ప్రకాష్ రెడ్డికే అని ప్రకటన చేయటంతో సుస్మిత ఆశలమీద నీళ్ళు చల్లినట్టు అయ్యింది. దీంతో పొలిటికల్ ఫ్యూచర్ పైన ఆందోళనలో ఉన్న కొండా సుస్మిత సీఎం రేవంత్ రెడ్డిని తీవ్రస్థాయిలో టార్గెట్ చేశారు. సీఎంపై సుస్మిత చేసిన విమర్శలు పార్టీలో తీవ్ర అలజడి సృష్టించాయి. దీనితో కొండా సురేఖపై షోకాజ్ నోటీసు, పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌లు వచ్చాయి. అయితే కొండా దంపతులు తమ కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తాము బాధ్యులు కాదని, ఆమె స్వతంత్ర వ్యక్తి అని స్పష్టం చేశారు. వారు కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కానీ కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించలేదు. ఒకవేళ అదే చేస్తే కూతురికి రాజకీయంగా అనవసరపు ఇబ్బంది వస్తుందని, కూతురి కోసం పోరాటమే చెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు. కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తల్లిదండ్రులు తమ బిడ్డ రాజకీయ భవిష్యత్తు కోసం తమ పదవి, పార్టీలోని స్థానం, దశాబ్దాలుగా నిర్మించుకున్న రాజకీయ జీవితాన్ని రిస్క్ చేయటం మామూలు విషయం కాదు. కానీ కొండా దంపతులు ఈ రిస్క్ చేశారు. ఏదేమైనా ఎదో ఒక రచ్చతో నిత్యం ప్రజల మధ్యన హాట్ టాపిక్ గా నిలుస్తూ కొత్త రకం ప్రచారానికి తెర తీస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఊపందుకుంటున్నాయి. మంత్రివర్గం నుండి కొండా సురేఖకు ఉద్వాసన పలుకుతున్న క్రమంలో కొండా దంపతుల రాజకీయ భవితవ్యంపైన చర్చ జరుగుతోంది. మొదట నుండి వివాదాస్పదులే అయినప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బలమైన కేడర్, వరంగల్ లో బలమైన పట్టు, ఉన్న మంత్రి కొండా సురేఖ, కొండా మురళీ దంపతులు నూతన రాజకీయ శక్తిగా ఆవిర్భవించేందుకు సమాయత్తమవుతున్నారనే వార్తలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్నాయి. బీసీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవమే ప్రధాన అజెండాగా వారు ఈ నిర్ణయం తీసుకోబోతున్నారని వారి అనుచరులు, శ్రేయోభిలాషులు చెబుతున్నారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గాల ఆత్మగౌరవ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా వారు వ్యూహ రచన చేస్తున్నారని సమాచారం. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, పుష్కలమైన ప్రజా మద్దతు, అంగబలం, ఆర్థిక బలం తమకు అనుకూలంగా ఉన్నాయని కొండా దంపతులు భావిస్తున్నారు. ప్రస్తుతం బీసీ మేధావులు, శ్రేయోభిలాషులు, మద్దతుదారులతో విస్తృత స్థాయిలో సమాలోచనలు కొనసాగుతున్నాయి. కొండా దంపతుల నిర్ణయం బీసీల ఏకీకరణకు ఇది మంచి అవకాశం అని వారి మద్దతుదారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో మెజారిటీ జనాభా ఉన్న బీసీ వర్గాలను ఒకే వేదికపైకి తెచ్చి, వారికి తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు ఈ చర్య దోహదపడుతుందని అంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో టికెట్లు దక్కక నిరాశలో ఉన్న సమర్థులైన నాయకులకు అవకాశం కల్పించి, వారిని గెలిపించుకునే వ్యూహంతో ముందుకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. కోదండరామ్, కవిత, తీన్మార్ మల్లన్న వంటి నాయకులు స్వంత వేదికల ద్వారా గుర్తింపు పొందినట్లే, దశాబ్దాలుగా ప్రజాదరణ ఉన్న తాము కూడా స్వతంత్రంగా ముందుకు రావాలనే ఆలోచన కొండా దంపతుల్లో ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. ప్రకటన అనంతరం నేరుగా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరి కొండా దంపతులు కొత్త రాజకీయ పార్టీ పెడితే వారి వెంట నడిచేవారు ఎందరు? వారు ఈ ప్రయత్నంలో సక్సెస్ అవుతారా అన్న చర్చ కూడా సాగుతుంది. అయితే, దీనిపై కొండా కుటుంబం నుండి అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.

## చట్టబద్ధతోనే దత్తత ప్రక్రియ

మొదటిపేజీ తరువాయి..

తల్లిదండ్రులను గుర్తించడంలో పోలీసుల వైఫల్యాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ మేరకు డీఎన్ఏ శాంపిల్స్ సేకరణ వంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలంటూ హోంశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో వారంలోగా నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. 2023లో దత్తత తీసుకున్న ఓ చిన్నారిని పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ నల్గొండ జిల్లా సూరారం మండలానికి చెందిన ఎం.వెంకన్న దంపతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి రూల్స్‌కు విరుద్ధంగా జరిగిన దత్తతను అనుమతించలేమంటూ పిటిషన్‌ను కొట్టివేయడంతో వెంకన్న అప్పీల్ చేశారు.

## కేబినేట్ లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

హైదరాబాద్,సెప్టెంబర్3(ప్రజాజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు

## నన్ను తొలగించడం కుట్రే..

మొదటిపేజీ తరువాయి..

రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే "దుష్టశక్తులు" తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు. ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపోమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. తన మీద, తన మాజీ ఓఎస్‌డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు.

# కొండా సురేఖ బర్తరఫ్

మొదటిపేజీ తరువాయి..

నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

## నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరట

మొదటిపేజీ తరువాయి..

వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారికి ఇది వర్తించదని ధర్మాసనం తేల్చి చెప్పింది. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు లేఖ రాశారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నల్సార్ వైస్-ఛాన్సలర్‌ను ఆదేశించారు. అంతటితో ఆగకుండా, నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేసుకోవద్దని దేశంలోని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రావడంతో మనన్ కుమార్ మిశ్రా ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా బీసీఐ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ధర్మాసనం, విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నల్సార్ విద్యార్థులకు పెద్ద ఉపశమనం లభించింది.

## జన్మతః పౌరసత్వ ఆంక్షల ఆదేశాలు నిలిపివేత

మొదటిపేజీ తరువాయి..

సహజంగా లభించే పౌరసత్వంపై ఆంక్షలు విధించేందుకు ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల అమలును యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు నిలిపివేసింది. 'బర్త్ టూరిజం'ను అడ్డుకోవడంతో పాటు, అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలపై ఉన్నవారి పిల్లలకు జన్మతః పౌరసత్వం లభించకుండా పరిమితులు తీసుకురావాలని ట్రంప్ ఇటీవల కొత్త ఉత్తర్వులపై సంతకం చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై ఇటీవల ట్రంప్‌నకు సుప్రీంకోర్టులోనూ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికాలో జన్మించిన పిల్లలకు వారి తల్లిదండ్రుల వలస స్థితితో సంబంధం లేకుండా పౌరసత్వ హక్కు కల్పించే రాజ్యాంగ నిబంధనలను ట్రంప్ పరిమితం చేయాలని ప్రయత్నించారు. అయితే ఆంక్షలపై న్యాయపరమైన వివాదం కొనసాగుతుండగా, ఆయన తీసుకొచ్చిన తాజా ఉత్తర్వులపైనా కోర్టు జోక్యం చేసుకుంది. దీంతో విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని నిరాకరించాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాలకు మరోసారి అడ్డంకి ఏర్పడింది. వాషింగ్టన్ డిసి ఫెడరల్ కోర్టులో జరిగిన ఈ విచారణలో జడ్జి డెబోరా బోర్డ్‌మన్ కీలకమైన అంశాలను ప్రస్తావించారు. ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నూతన విధానం గత వేసవిలో అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పునకు విరుద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించేలా ఈ తాజా ఉత్తర్వులు ఉన్నాయని, ఇవి రాజ్యాంగబద్ధంగా నిలబడే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు.

## భీమ్‌రెడ్డిపై ఈడీ మనీలాండరింగ్ కేసు

మొదటిపేజీ తరువాయి..

ఏసీబీ దర్యాప్తులో భారీగా బినామీ ఆస్తులు బయటపడటంతో ఈ అంశంపై ఈడీ దృష్టిసారించింది. అవినీతి ద్వారా అక్రమంగా సంపాదించిన మనీలాండరింగ్ ఏ విధంగా మళ్లించారనే కోణంలో ఈడీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఆస్తుల కొనుగోలు తీరు, భారీ నగదు లావాదేవీలు, ఆ నిధుల మూలాలపై పక్కా ఆధారాలను ఈడీ అధికారులు సేకరిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ బినామీ ప్రొహిబిషన్ యూనిట్ కూడా భీమ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతోంది. ఈడీ దర్యాప్తు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో, త్వరలోనే భీమ్‌రెడ్డితో పాటు ఆయన బినామీలకు కూడా ఈడీ అధికారులు విచారణ నిమిత్తం నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భీంరెడ్డి నివాసముంటున్న విల్లాను 2024లో రూ.4.5 కోట్ల రిజిస్ట్రేషన్ వాల్యూతో కొనుగోలు చేసినప్పటికీ ఇంకా రిజిస్ట్రేషన్ పూర్తి చేయలేదని కొద్ది రోజుల క్రితం నిర్వహించిన సోదాల్లో ఏసీబీ గుర్తించింది. గచ్చిబౌలి జయభేరి పైన్ వ్యాలీలోని 3400 చదరపు అడుగుల క్రాంతి సియోన్ అపార్ట్ మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌ను బినామీ విష్ణువర్ధన్ రెడ్డి పేరుతో కొనుగోలు చేయించినట్లు ఏసీబీ గతంలో తెలిపింది. 2023లో పటాన్‌చెరు డీఎస్పీగా పని చేస్తున్న సమయంలో ముత్తంగిలో రెండు ఇళ్లు కొనుగోలు చేసి బినామీ ఇంద్రకరణ్‌రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినట్లుగా తేలింది.

# దేశభక్తి విషయంలో అందరూ ఒక్కటే

మొదటిపేజీ తరువాయి..



కీలక వ్యాఖ్యలు చేశారు. దేశభక్తి విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాల కంటే అసదుద్దీన్ ఒవైసీ ఏ మాత్రం తక్కువ కాదని అన్నారు. కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఒవైసీని ఒక్క మాట అన్నా తాను సహించబోనని స్పష్టం చేశారు. తాను ఓల్డ్ సిటీకి వచ్చిన ఏకైక ముఖ్యమంత్రినని పేర్కొన్న రేవంత్‌రెడ్డి, గతంలోనే దీనిని ఓల్డ్ సిటీగా కాకుండా ఒరిజినల్ సిటీగా అభివర్ణించానని గుర్తుచేశారు. ఇక్కడి ప్రతి గల్లీ తనకు తెలుసని అన్నారు. అసదుద్దీన్ ఒవైసీ కోరిన అభివృద్ధి పనులను పరిశీలించి మంజూరు చేయాలని సభా వేదిక నుంచే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే బలాల కళాశాల అభివృద్ధికి రూ.20 కోట్లు కోరగా, తాను రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం నిధులు సమకూర్చినప్పటికీ, మంజూరైన పనులను ఏడాదిన్నరలోగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేదేనని స్పష్టం చేశారు. విద్య కోసం ఎంత మొత్తమైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో అసదుద్దీన్ ఒవైసీ హిందుస్థాన్‌కు మద్దతుగా నిలిచి దేశభక్తిని చాటుకున్నారని సీఎం పేర్కొన్నారు. రాజకీయ సిద్ధాంతాలు వేర్వేరుగా ఉండొచ్చని, కానీ దేశభక్తి విషయంలో అందరూ ఒక్కటేనని అన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న ఇతర ప్రాజెక్టులను కూడా సీఎం వివరించారు. కేబుల్ బ్రిడ్జి చూడాలంటే ఇప్పటివరకు దుర్గం చెరువుకు వెళ్లాల్సి వచ్చేదని, అందుకే మీరాలం చెరువులో మూడు కిలోమీటర్ల మేర కేబుల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో పనులు పూర్తి చేసి, మెట్రోలో వచ్చి ప్రజలను ఓట్లు అడుగుతామని అన్నారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, వనస్థలిపురం, రాజేంద్రనగర్, శంషాబాద్ వరకు మెట్రోను విస్తరించే ప్రణాళిక ఉందని వెల్లడించారు. హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నామని సీఎం చెప్పారు. హిందూ, ముస్లింలు కలిసి ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. మూసీ అభివృద్ధితో పాటు నైట్ ఎకానమీని ప్రోత్సహించి, స్థానిక పేద ముస్లింలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తూ ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఎన్నికలు ఉన్నప్పుడే రాజకీయాలు చేస్తామని, ఎన్నికలు ముగిసిన తర్వాత అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నగర అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం సైదాబాద్ బ్రిడ్జికి కేవలం కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోయిందని, నిర్మాణానికి ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని విమర్శించిన సీఎం, తమ ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించి ఈ ప్రాజెక్టును పూర్తి చేసిందని పేర్కొన్నారు. గత సర్కార్ చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి సకాలంలో నిధులు ఇవ్వలేదన్న సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వేగంగా వంతెన నిర్మాణం పూర్తి చేసిందని తెలిపారు. చంచల్‌గూడ-సంతోష్‌నగర్ రెండో స్టీల్ ఫ్లైఓవర్‌ను రేవంత్ రెడ్డి ప్రారంభించారు.


## పాస్ పోర్ట్ పోయినది

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కూతాటి మనోజ్ కుమార్ , తండ్రి, రాజయ్య, గారి పాస్‌పోర్ట్ 20-08-2026, రోజున బొమ్మనపల్లి నుండి కరీంనగర్ కి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గంమధ్యలో కుతాటి మనోజ్ కుమార్ ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. పాస్ పోర్ట్ నెంబర్ X7130369, తేదీ:27-02-2023 రోజు జారీ చేయడమైనది. కావున ఎవరికైనా పాస్ పోర్ట్ దొరికినచో ఇవ్వగలరు. వారికి తగిన పారితోషకము ఇవ్వబడును.

సంప్రదించాల్సిన నెంబర్: 6309353546,94913 66546.



తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ శాఖ

జిల్లా కలెక్టర్ కార్యాలయము, ఆదిలాబాద్
(ఫారం-సి)
(ప్రాథమిక నోటిఫికేషన్)

(చట్టములోని సెక్షన్ 11 అనుసరించి 10-ఎ రూల్ మినహాయింపు ఇవ్వబడినది (రూల్ 6/12 చూడుము)

కలెక్టరు ఫైల్ నెం. జి1/143/2022 — తేది: 29.08.2026
ఆర్డీఓ. ఫైల్ నెం. బి/98/2022 — తేది: 29.08.2026
గెజిట్ నెం. P.N.U/s-11(1)/08-N/2026 — తేది: 29.08.2026

ఈ దిగువ నిర్దిష్టపరిచిన ఆదిలాబాద్ జిల్లా/భీంపూర్/తాంసి మండలములోని గొల్లఘాట్, గుంజాల, పిప్పల్ కోటి, తాంసి-(కె), ఘోట్‌కూరి గ్రామములోని మొత్తము విస్తీర్ణము ఎ.19.16 గుంటలు భూమి (పట్టా భూమి-Ac.13.33 Gts, ప్రభుత్వ భూమి -Ac.5.23 Gts) ప్రజా ప్రయోజనార్థం పెన్ గంగా ప్రాజెక్టు (CKB కెనాల్) నిర్మాణము నిమిత్తం దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సెక్షన్ 6(2) క్రింద (చట్టం 30/2013)లో పేర్కొనిన ప్రకారం నీటి పారుదల శాఖ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక అవసరం లేనందున అనుబంధంలో పేర్కొనిన భూములకై నోటీసు జారీ చేయనైనది.

ఇట్టి ఇంటర్ స్టేట్ లోయర్ పెన్ గాంగ ప్రాజెక్టు ప్రభుత్వ ఉత్తర్వులు జీ.ఓ.ఎంఎస్.నెం.58 ఇ.అండ్ సి ఎ డి (ఎల్.ఎ.అర్ & ఆర్/ఎ2) ఇట్టి లోవర్ పెన్ గంగా ప్రాజెక్టునకు ప్రభుత్వం ఉత్తర్వుల శాఖ తేది: 25.07.2017 ననుసరించి భూసేకరణ పునరావాస పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 చాప్టర్-II మరియు-III పరిధి నుండి మినహాయింపు ఇవ్వబడినది.

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులను చేపట్టుటకు చట్టములోని సెక్షన్ 43 నిబంధనల ప్రకారము G.O.Ms.No. 139 Revenue (JA & LA) dept Date: 20.08.2015 మరియు జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్ గారి ఉత్తర్వులు No G1/143/2022 తేది: 16.02.2022 ప్రకారము భూసేకరణ అధికారిగా రాజస్వ మండల అధికారి ఆదిలాబాద్ గారిని, మరియు G.O.Ms.No.6 అనుసరించి ప్రాజెక్టు పాలన అధికారిగా అదనపు కలెక్టరు (రెవిన్యూ) మరియు కలెక్టర్, ఆదిలాబాద్ గారి ఉత్తర్వులు నెం. G1/143/2022 తేది: 16.02.2022 ప్రకారము నియమించడము జరిగినది.

కావున ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ జిల్లా/భీంపూర్/తాంసి మండలములోని గొల్లఘాట్, గుంజాల, పిప్పల్ కోటి, తాంసి-(కె), ఘోట్‌కూరి గ్రామములోని మొత్తము విస్తీర్ణము ఎ.19.16 గుంటలు భూమి (పట్టా భూమి-Ac.13.33 gts, ప్రభుత్వ భూమి-Ac.5.23 gts) భూమి యొక్క వివరములు ఈ క్రింది చూపిన వానిని భూసేకరణ పనులు ప్రారంభ నిమిత్తం ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేయనైనది.

షెడ్యూలు

గ్రామము : గొల్లఘాట్ (6 గ్రామములు) — మండలము : భీంపూర్/తాంసి — జిల్లా : ఆదిలాబాద్

| క్రమ నంబరు | సర్వే నెం. | టీటీ నెం | సర్వే విస్తీర్ణం | పట్టా/మెట్ట/తరి | ఎంజాయ్ మెంట్ విస్తీర్ణం | పట్టేదార్ పేరు | అనుభవదారుపేరు/తండ్రి పేరు | చెట్లు/బోర్ వెల్/పైప్‌లైన్/ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1. గొల్లఘాట్ గ్రామము భీంపూర్ మండలము (ఎల్‌పిపి-లింక్ కెనాల్) | | | | | | | | |
| 1 | 44/3/1 | 44/3/1 | 0.03 | సీలింగ్ | 0.03 | [illegible] | స్వంతం | లేదు |
| 2 | 44/5 | 44/5 | 0.07 | భూమి | 0.07 | [illegible] | స్వంతం | " |
| 3 | 44/6/1 | 44/6/1 | 0.14 | సీలింగ్ | 0.14 | [illegible] | స్వంతం | " |
| [illegible] | | | | | | | | |
| 15 | 61/8 3 | | పట్టా/మెట్ట | 0.02 1/2 | | [illegible] తండ్రి రాజన్న | స్వంతం | " |
| | మొత్తం | | 2.10 | | 2.10 | | | |
| సంపూర్ణ మొత్తం | | | 19.16 | | 19.16 | | | |

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన భూములకు సంబంధించిన ఎవరూ ఎటువంటి లావాదేవీలు/తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూమి యొక్క ప్లాన్, ఏదైన పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టరు, ఆదిలాబాద్, రాజస్వమండల అధికారి, ఆదిలాబాద్ గారి కార్యాలయములలో తనిఖీ చేసుకోవచ్చును. తదుపరి తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ మరియు సంబంధిత ప్రభుత్వం ఎంత భూమిని స్వాధీనము చేసుకోవాలో నిర్ణయించుకొనే క్రమములో సెక్షన్ 12 ప్రకారం అధికారులు, ఉద్యోగులు వారి వద్ద పని చేసే కార్మికులకు పైన చూపిన భూములలో గల ఏదైన ప్రదేశంలోకి ప్రవేశించి, సర్వే జరిపి భూకమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూఉపరితలం తెలుపు బోర్ వెయ్యుటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ (15) ప్రకారం, ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ తరువాత పైన చూపిన భూములలో ఎలాంటి సంబంధమున్న వ్యక్తులైన భూసేకరణపై అభ్యంతరములున్నచో అట్టి వ్యక్తులు, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60 అరవై రోజులు) దినములలోపు భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

భూ యజమానులు, ఆసక్తి గల వ్యక్తులు వారి నష్టపరిహారాన్ని సంప్రదింపుల ద్వారా పరిష్కారం చేయదలుచుకుంటే వారు తమ అభ్యంతరములను ఫారం E-1 & G-1, G-III, ద్వారా నోటిఫికేషన్ వెలువడిన తదుపరి G.O.Ms.No.120 revenue (JA & LA) Dept Date : 30.06.2017 అనుసరించి సమర్పించవచ్చును.

సం/-, రాజస్వ మండలాధికారి మరియు భూసేకరణ అధికారి, ఆదిలాబాద్ — సం/- అదనపు కలెక్టర్, ఆదిలాబాద్ — సం/-. జిల్లా కలెక్టర్, ఆదిలాబాద్

DIPR RO.NO:809/LA/PP/Advt/Pub/2026-27

# కృష్ణం వందే జగద్గురుమ్





- నేడే శ్రీకృష్ణాష్టమి (గోకులాష్టమి)
- కృష్ణనామస్మరణతో మార్మోగనున్న ఆలయాలు
- అధర్మ సంహారం... ధర్మ సంస్థాపనం
- ధర్మసంస్థాపనార్థం... శ్రీకృష్ణావతారం
- ఉట్టికోతలు... కోలాటాలతో అలరించనున్న బాలకృష్ణుల ముచ్చట్లు
- మానవాళికి దిశానిర్దేశం... భగవద్గీతా సందేశం

నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3, (ప్రజాజ్యోతి) : శ్రీమహావిష్ణువు అవతారాలలో అత్యంత విశిష్టమైన శ్రీకృష్ణావ తారాన్ని స్మరించుకునే పర్వదినమే శ్రీకృష్ణాష్టమి. నేడు దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధ లతో గోకులాష్టమి వేడుకలను నిర్వహించేందుకు ఆలయాలు ముస్తాబయ్యాయి. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి, రాత్రివేళ శ్రీకృష్ణ జన్మ ఘట్టాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక జ్యోతీష్యులు, అధ్యాపకులు ఇందుర్తి ఆచార్య కళ్యాణ్ ప్రజాజ్యోతితో శ్రీ కృష్ణ జననం గూర్చి వివరించారు.





" సింహమాసే సితే పక్షే రోహిణ్యామష్టమీతిథౌ !
చరమార్థప్రదాతారం కృష్ణం వదే జగద్గరుమ్ !! "
" తతోఖిల జగత్పద్మభోధాయాచ్యుతభానునా !
దేవకీ పూర్వ సన్ద్యాయావిర్భూతం మహాత్మనా !! "

ద్వాపరయుగంలో ధర్మం క్షీణించి, అధర్మం పెరిగిన సమయంలో శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడిగా అవతరించారని పురాణాలు పేర్కొంటున్నాయి. శ్రావణ బహుళ అష్టమి తిథి, రోహిణి నక్షత్రంలో అర్ధరాత్రి సమయంలో శ్రీకృష్ణుడు జన్మించాడని విశ్వాసం. కంసుడి దురాగతాలను అంతం చేసి ధర్మాన్ని స్థాపించేందుకు శ్రీకృష్ణుడు అవతరించినట్లు పురాణ గాథలు వివరిస్తాయి.

**కృష్ణ నామస్మరణతో మార్మోగనున్న ఆలయాలు :** కృష్ణాష్టమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, పుష్పార్చనలు, నామసంకీర్తనలు నిర్వహిస్తారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి ఉట్టి కొట్టడం, కోలాటాలు, భజనలు వంటి కార్యక్రమాలను నిర్వహించడం ఈ పర్వదినానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఇళ్లలో కూడా బాలకృష్ణుడికి ఇష్టమైన వెన్న, పాలు, పెరుగు, పాయసం తదితర నైవేద్యాలను సమర్పిస్తారు.

**భగవద్గీత సందేశమే శ్రీకృష్ణుడి బోధ :** శ్రీకృష్ణుడు కేవలం భక్తులకు ఆరాధ్య దైవమే కాకుండా, మానవాళికి మార్గదర్శకుడు. కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడికి అందించిన భగవద్గీత మానవ జీవితానికి అమూల్యమైన మార్గదర్శకంగా నిలిచింది. "కర్మ చేయడమే మన బాధ్యత.. ఫలితాన్ని ఆశించకూడదు" అనే కర్మయోగ సందేశంతో పాటు ధర్మం, సత్యం, న్యాయం, భక్తి, జ్ఞానం వంటి విలువలను శ్రీకృష్ణుడు ప్రపంచానికి బోధించాడు.

శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుని లీలలను స్మరించుకుంటూ, ఆయన బోధించిన ధర్మమార్గాన్ని అనుసరించాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. "కృష్ణం వందే జగద్గురుం" అంటూ కృష్ణ నామస్మరణతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందనున్నారు.

## అంగన్వాడీల్లో చిన్నారులకు
# ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి

- పిల్లల సమగ్ర వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా







నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3, (ప్రజాజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేలా అన్ని రకాల మౌలిక వసతులు, ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

గురువారం నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

గ్రామాల్లోని చిన్నారులందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కేంద్రాలను పిల్లలను ఆకట్టుకునే విధంగా రంగురంగుల బొమ్మలు, పెయింటింగ్స్, వర్ణమాల, విద్యా చార్టులతో అలంకరించి, ఆటపాటల ద్వారా చిన్నారులకు విద్యాబోధన అందించాలని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడేలా ప్రతిరోజూ పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటలు, రైమ్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, ఎత్తు, బరువు తదితర వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.

**సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి :** సామ్, మామ్ కేటగిరీకి చెందిన పిల్లల వివరాలను పకడ్బందీగా నమోదు చేసి, పోషకాహార లోపం ఉన్న చిన్నారులకు అదనపు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి గర్భిణి, బాలింతకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, పోషకాహార సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ చిన్నారులతో సరదాగా ముచ్చటించారు. వారి పేర్లు, చదువు గురించి అడిగి తెలుసుకుని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి రావాలని సూచించారు. చిన్నారులతో రైమ్స్ చెప్పించి, సంఖ్యలు చదివించడంతో పాటు వారికి చాక్లెట్లు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, వైద్యారోగ్య శాఖ అధికారులు పవన్ కుమార్, సౌమ్య, నయనా రెడ్డి, రమేష్, అలీ, సర్పంచ్ హరీష్, ఉప సర్పంచ్ భూమేష్, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలి

చౌహాన్ వినోద్ సింగ్ సర్పంచుల సంఘం అధ్యక్షులు



సోనాల, సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి) : సోనాల మండలంలోని పార్డి గ్రామ పంచాయతీ పుణ్య నాయక్ గ్రామంతో పాటు పార్డి గ్రామంలో ఆరోగ్య శిఖరం నిర్వహించి మందులు పంపిణీ చేసి పలు సూచనలు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా పార్డి(కే) గ్రామ సర్పంచ్ చౌహన్ వినోద్ సింగ్ మాట్లాడుతూ వర్షాకాలంలో విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలని, ఇంటి పక్కన నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సోనాల ప్రథనిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ ఉత్తం, ఏఎన్ఎం ఉష, ఆశ వర్కర్లు రాధా, ప్రేమల కాలనీ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సహాయం అందజేత



జన్నారం, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి) : జన్నారం మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన బిస్కుల సరోజ రామన్న దంపతుల కుమార్తె మానస వివాహం ఈ నెల 5వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఆ నిరుపేద యువతి వివాహానికి చింతగూడ గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు సాయిని ప్రసాద్ నేత రూపాయలు ఐదువేలు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద యువత వివాహానికి తనవంతు ఆర్థిక సహాయం అందజేశానని, దాతలు పెద్దమనసు చేసుకొని ఆ నిరుపేద యువతి వివాహానికి ధన రూపేనా, వస్తు రూపేన సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరే జ్యోతి శిరీష్ కుమార్, నేతకాని కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, తాటి శ్రీనివాస్, సత్యనారాయణ, గట్టు బుజ్జన్న, దుర్గం వినోద్, సాయిని సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## రైతులంతా క్రాప్ సర్వేలో పంటల వివరాలను
# తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి







- రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో పంటల వివరాల నమోదు
- ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా సర్వే పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3, (ప్రజాజ్యోతి) : జిల్లాలోని రైతులందరూ తమ సాగు, పంటల వివరాలను క్రాప్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా స్పష్టం చేశారు. గురువారం సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ గ్రామ శివారులో పొలాల్లో కొనసాగుతున్న క్రాప్ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ, పంటల వివరాలు క్రాప్ సర్వేలో సక్రమంగా నమోదైతే భవిష్యత్తులో ధాన్యం విక్రయాలు, ప్రభుత్వ పథకాల ద్వారా లభించే సహాయం, ఇతర వ్యవసాయ ప్రయోజనాలు పొందే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందికి అవసరమైన సహకారం అందించి, తమ పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

క్రాప్ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పంటల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే సిబ్బంది తప్పనిసరిగా రైతుల సమక్షంలోనే పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ సాగు వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా క్రాప్ సర్వేను పూర్తి చేసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక యువతను వాలంటీర్లుగా నియమించుకుని వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, నమోదు ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఎంపీఓ అజీజ్ ఖాన్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు లెక్కలెక్కడ?..

- వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఏం చేసిందో చూస్తారా!
- సంక్షేమంపై చర్చకు సిద్ధం.. బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ నేతల సవాల్
- పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పాలి..
- వెయ్యి రోజుల్లో ప్రజలకు అందించిన పథకాలపై చర్చిద్దాం



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి : పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో, గ్రామాల అభివృద్ధికి ఎన్ని నిధులు ఖర్చు చేసిందో పూర్తి లెక్కలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై బీఆర్ఎస్ నాయకులతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనను.. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనను ప్రజల సమక్షంలో పోల్చి చూద్దామని అన్నారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్క ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాపర్తి మురళి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంచుకుని సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులు ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా రాపర్తి మురళి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యంగా మహిళలు, రైతులు, పేదలు, విద్యార్థులు, నిరుద్యోగులు, సామాన్య కుటుంబాలకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు, పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం, సామాన్య కుటుంబాలకు ఉపశమనం కలిగించేలా రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

**బీఆర్ఎస్ పాలనపై లెక్కలు చెప్పాలి :** పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మురళి అన్నారు. "పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేశారు? ఎన్ని కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చారు? గ్రామాల్లో ఏం అభివృద్ధి చేశారు? ఎన్ని శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టారు?" అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై మాట్లాడే ముందు తమ పదేళ్ల పాలనకు సంబంధించిన లెక్కలు ప్రజల ముందు ఉంచే ధైర్యం ఉందా అని నిలదీశారు. పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై గ్రామాల వారీగా, నియోజకవర్గాల వారీగా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

**ప్రజల ముందే తేల్చుకుందాం :** బీఆర్ఎస్ పదేళ్ల పాలన.. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బహిరంగ చర్చకు రావాలని మురళి సవాల్ విసిరారు. "మా ప్రభుత్వం ఏం చేసిందో ప్రజల ముందే చెబుతాం. మీరు పదేళ్లలో ఏం చేశారో మీరు చెప్పండి. ఎవరి పాలనలో ప్రజలకు ఎక్కువ ప్రయోజనం కలిగిందో ప్రజలే నిర్ణయిస్తారు" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల్లో మంచి స్పందన వస్తుండటాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని సూచించారు.

**ప్రతి గ్రామానికి ప్రభుత్వ పథకాలు :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామంలోని ప్రజలకు వివరించాలని పార్టీ కార్యకర్తలకు రాపర్తి మురళి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి సమాచారం అందించి, పథకాల ప్రయోజనాలు పొందేలా సహకరించాలని అన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి పనిచేస్తోందని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మంగ మణ్రి బాలు, ఏఎంసీ డైరెక్టర్ విశ్వనాథ్, శంకర్, వాంకిడి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ, రాము తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సరండి గుట్టపై కొలువైన అమ్మోరు తల్లి ఆశీస్సులకై ఎల్లమ్మ తల్లి, భవానీమాత దర్శనం కోసం
# వేలకళ్ళతో భక్తుల ఎదురుచూపులు

- తరతరాలుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక సంప్రదాయం
- సరిహద్దు ప్రాంతాల నుంచి తరలిరానున్న భక్తజనం.. ఏర్పాట్లపై ఆశలు
- ప్రపంచ వ్యాప్తంగా పొలాల అమావాస్య అయిన మరుసటి రోజున జాతర మహోత్సవం
- సర్పంచ్ బాపూజీ హయంలో, కృషి, ముందడుగుతో..
- ఈ ఏడాది కూడా వేలయే జాతరకు!

ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి) : ఈఏడాది సరండి గ్రామపంచాయతీ సర్పంచ్ మొహర్లే బాపూజీ హయాంలో, కృషి ముందడుగుతో..చరిత్ర పుటల్లో ముద్రించబడిన భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన జాతర ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సన్నాహాక సాగుతున్నాయి. తరతరాలుగా కొనసాగుతున్న ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు సరిహద్దు ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. జాతర సందర్భంగా అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించుకోవడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై సర్పంచ్ బాపూజీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామస్థులు, భక్తుల సహకారంతో జాతరను ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు. దీంతో మళ్లీ వచ్చేసింది.. జాతర సందడి" అంటూ సరండి పరిసర ప్రాంతాల్లో ఇప్పటి నుంచే ఆధ్యాత్మిక సందడి నెలకొంటోంది. ఏడాది తిరిగింది.. మళ్లీ జాతర సమయం వచ్చేసింది. సరండి గ్రామ సమీపంలోని బోడగుట్టపై కొలువైన భవానీమాత జాతర కోసం భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏడాది ప్రత్యేక భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈ జాతర ఈసారి కూడా ఘనంగా జరగనుండటంతో సరండి గ్రామంలో సందడి మొదలైంది. జాతర రోజున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. బోడగుట్ట జాతరకు స్థానికంగా ఎంతో ప్రత్యేకత ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, విశ్వాసాలతో ఈ జాతర ముడిపడి ఉంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వివిధ వర్గాల ప్రజలు జాతరలో పాల్గొని భవానీమాతను దర్శించుకోవడం ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీగా స్థానికులు చెబుతున్నారు.

**అమ్మవారి దర్శనానికి ప్రత్యేక ప్రాధాన్యం :** జాతర రోజున బోడగుట్టకు చేరుకునే భక్తులు ముం దుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కొబ్బరికాయలు, పూలు, పూజా సామగ్రితో గుట్టకు చేరుకుని నైవేద్యాలు సమర్పిస్తారు. కుటుంబ సభ్యులంతా కలిసి అమ్మవారి సన్నిధిలో పూజలు చేయడం ద్వారా కుటుంబానికి మేలు జరుగుతుందని భక్తుల విశ్వాసం. తమకు ఉన్న మొక్కులను తీర్చుకునేందుకు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు రావడం ఈ జాతర ప్రత్యేకతగా నిలుస్తోంది. కొందరు ప్రతి ఏడాది తప్పకుండా జాతరకు హాజరవుతుండగా.. మరికొందరు తమ కుటుంబ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అమ్మవారి దర్శనం చేసుకుంటున్నారు.

**గ్రామంలో పండుగ వాతావరణం :** జాతర సమీపిస్తుండటంతో సరండి గ్రామంలో పండుగ వాతావరణం కనిపిస్తోంది. జాతరకు వచ్చే బంధువులు, స్నేహితుల కోసం స్థానిక కుటుంబాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఏడాదిలో ఒకసారి జరిగే ఈ జాతరను గ్రామస్తులు ప్రత్యేకంగా భావిస్తారు. గ్రామానికి దూరంగా నివసిస్తున్న వారు సైతం జాతర సందర్భంగా స్వగ్రామానికి చేరుకోవడంతో బంధుమిత్రుల కలయికకు వేదికగా మారుతోంది. జాతర రోజున గుట్ట పరిసరాలు భక్తుల రాకతో కిటకిటలాడుతాయి. భక్తుల పూజలు, సందడి, చిన్నారుల ఆటపాటలతో బోడగుట్ట పరిసర ప్రాంతం ప్రత్యేక వాతావరణాన్ని సంతరించుకుంటుంది. వ్యాపారులకు ఉపాధి.. ప్రజలకు సందడి జాతర సందర్భంగా తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయడంతో స్థానిక చిన్న వ్యాపారులకు కూడా ఉపాధి లభిస్తుంది. పూలు, పూజా సామగ్రి, కొబ్బరికాయలు, పండ్లు, తినుబండారాలు తదితర వస్తువుల విక్రయాలు సాగుతాయి. చిన్నారుల కోసం ఆట వస్తువుల దుకాణాలు ఏర్పాటు కావడంతో జాతరకు వచ్చే కుటుంబాల్లో మరింత ఉత్సాహం కనిపిస్తుంది. జాతర ఒక్కరోజే జరిగినా.. దాని సందడి మాత్రం గ్రామస్తులకు ఎంతోకాలం గుర్తుండిపోయేలా ఉంటుంది. బంధువుల కలయిక, అమ్మవారి దర్శనం, గ్రామీణ సంప్రదాయాల పరిరక్షణ వంటి అంశాలు జాతర ప్రత్యేకతను చాటుతున్నాయి.







**ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలి :** భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. బోడగుట్టకు వెళ్లే రహదారి, గుట్టకు చేరుకునే మార్గాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జాతర రోజున రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య ఏర్పాట్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్య సేవలు అందేలా ప్రాథమిక వైద్య కేంద్రం లేదా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచిస్తున్నారు.

**ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి అవసరం :**

జాతర రోజున వివిధ గ్రామాల నుంచి వాహనాలు భారీగా వచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. గుట్టకు వెళ్లే మార్గంలో వాహనాలు నిలిచిపోకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, పార్కింగ్ ప్రాంతాలను క్రమబద్ధీకరించాలని అంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడకుండా గుట్టపైకి వెళ్లే మార్గంలో అవసరమైన సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**పారిశుధ్యం.. అధికారుల ముందున్న మరో సవాల్ :** జాతర సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే నేపథ్యంలో చెత్తాచెదారం పేరుకుపోకుండా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గుట్ట పరిసరాలు, రహదారులు, జాతర ప్రాంగణాన్ని జాతర ప్రారంభానికి ముందే శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. జాతర అనంతరం కూడా వ్యర్థాలను వెంటనే తొలగించేలా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

**సంప్రదాయం నిలవాలి.. సౌకర్యాలు పెరగాలి :**

బోడగుట్ట భవానీమాత జాతర కేవలం ఒకరోజు జరిగే ఉత్సవం మాత్రమే కాకుండా స్థానిక ప్రజల విశ్వాసానికి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. కాలం మారుతున్నా జాతరపై ప్రజల ఆసక్తి తగ్గకపోవడం విశేషం. కొత్త తరం కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగించేలా జాతరను మరింత సౌకర్యవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది కూడా భవానీమాత బోడగుట్ట జాతర భక్తుల కోలాహలంతో కళకళలాడనుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యాలు కల్పించేలా అధికారులు ముందస్తు చర్యలు చేపడితే జాతర మరింత విజయవంతంగా సాగుతుందని స్థానికులు ఆశిస్తున్నారు. జాతర కోసం ఎదురుచూపులు.. ఏడాది గడిచింది.. జాతర మళ్లీ వచ్చింది.. బోడగుట్టపై భవానీమాత దర్శనం కోసం భక్తులు మరోసారి బాట పట్టనున్నారు. భక్తి, సంప్రదాయం, బంధుత్వం, గ్రామీణ సంస్కృతి కలగలిసిన ఈ జాతర సరండి ప్రాంతానికి మరోసారి ప్రత్యేక శోభను తీసుకురానుంది.

# గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి రూ.19.02 లక్షల బీమా చెక్కు

## మాసప్ప కుటుంబానికి ఆర్థిక భరోసా అందించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ): గల్ఫ్ దేశంలో పనిచేస్తూ స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో గుండెపోటుతో మృతి చెందిన వలస కార్మికుడు ముసిరిప్ప మాసప్ప కుటుంబానికి రూ.19,01,968 బీమా సొమ్ము ఆర్థిక భరోసాగా నిలిచింది. బీమా మొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మాసప్ప భార్య



ముసిరిప్ప వెంకటమ్మకు అందజేశారు. గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామానికి చెందిన మాసప్ప గత 15 ఏళ్లుగా గల్ఫ్ దేశంలో వలస కార్మికుడిగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. 2025 మే 22న స్వగ్రామానికి వచ్చిన ఆయన తిరిగి గల్ఫ్‌కు వెళ్లేందుకు విమానం ఎక్కే సమయంలో గుండెపోటుకు గురై మృతి చెందారు. గల్ఫ్‌లో పనిచేస్తున్న సమయంలో మాసప్ప పనిచేసిన కంపెనీతో కుదుర్చుకున్న బీమా ఒప్పందం మేరకు ఆయన కుటుంబానికి రూ.19,01,968 బీమా మొత్తం మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కలెక్టర్ ఖుష్బూ గుప్తా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విదేశాల్లో పనిచేస్తున్న వలస కార్మికుల కుటుంబాలకు బీమా పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. అనుకోని ప్రమాదాలు, ఆపద సమయంలో బీమా సొమ్ము కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎ. నిర్మల, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా ఎస్ఐఆర్‌ను విజయవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల సెప్టెంబర్ 03(ప్రజా జ్యోతి ప్రతినిధి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం



మ్యాపింగ్ కాని,అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్న నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,జిల్లాలో మొత్తం 1,49,282 మందికి నోటీసులు జారీ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు 36 వేల మందికి నోటీసులు అందజేసినట్లు తెలిపారు.కొంత మంది ఓటర్లు అందుబాటులో లేకపోవడం,ఇతర కారణాల వల్ల అర్హులైన వారు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు,బీఎల్ఏలు,బీఎల్వోలు సమన్వయంతో పనిచేసేలా సహకరించాలని సూచించారు.తప్పులు లేని,పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఏ,బి,సి,కేటగిరీల వారీగా ఓటర్లు సమర్పించాల్సిన ధ్రువపత్రాలపై ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే స్పష్టమైన అవగాహన కల్పించి,అవసరమైన దిశానిర్దేశం చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగా ఈ నెల 5న మున్సిపల్ కౌన్సిలర్లు,సర్పంచులు,వార్డు అధికారులు,గ్రామపంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ఎన్నికల విభాగం అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్,ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల,గద్వాల తహసీల్దార్ హరికృష్ణతో పాటు ఇతర అధికారులు,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు బోగస్.. 420 హామీలు మోసం!

## - కాంగ్రెస్‌ది దగాకోరు పాలన: బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్

వనపర్తి, సెప్టెంబరు 3 (ప్రజాజ్యోతి): ఆరు గ్యారంటీల పేరుతో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం వనపర్తి అంబేద్కర్ చౌరస్తాలో పట్టణ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో రైతు నిరసన




సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వాకిటి శ్రీధర్ కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పాలనపై విమర్శలు గుప్పించారు. వనపర్తి అభివృద్ధికి రూ.2,389 కోట్ల నిధులతో పనులు చేపట్టామని ప్రభుత్వం చెబుతోందని, ఆ నిధులతో ఎక్కడెక్కడ పనులు జరుగుతున్నాయి, ఏ కాంట్రాక్టర్లకు అప్పగించారనే వివరాలను శ్వేతపత్రం రూపంలో వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు, జీవోల విషయంలో పారదర్శకత పాటించడం లేదని ఆరోపించారు. రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని శ్రీధర్ విమర్శించారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించినప్పటికీ రైతులకు పూర్తి స్థాయిలో అందలేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులను ప్రస్తావిస్తూ రైతులను పంటల సాగు విషయంలో ప్రభుత్వం గందరగోళానికి గురిచేస్తోందని విమర్శించారు. యూరియా కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనే విధానం రైతులకు ఇబ్బందికరంగా మారుతుందని ఆయన అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేని రైతులు ఈ విధానంలో ఎలా దరఖాస్తు చేసుకుంటారని ప్రశ్నించారు. రూ.4 వేల పింఛన్ హామీ అమలులో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని శ్రీధర్ ఆరోపించారు. వృద్ధులు, వితంతువులు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న అనేక హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదని, ప్రజలు ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, రమేష్‌గౌడ్, మాణిక్యం, నరసింహ, మాధవరెడ్డి, మహేశ్వరెడ్డి, గులాం, తిరుమల్, పరంజ్యోతి, నెల్లస్వామి, మురళి, సాగర్, చింటూ, కవిత, శ్రీలత, జాహెబ్, రమేష్, ప్రేమ్‌కుమార్, హలీం, అస్లాం, ఆరిఫ్, బాలకృష్ణ, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణకు స్పీడ్ పెంచండి.. పెండింగ్ సమస్యలకు చెక్ పెట్టండి

## భూసేకరణ పనుల్లో జాప్యానికి తావులేదు
## పెండింగ్ అంశాలను గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ): జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులు, భారత్‌మాల జాతీయ రహదారి, రైల్వే లైన్ డబ్లింగ్, పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భారత్‌మాల, జాతీయ రహదారులు, రైల్వే లైన్ డబ్లింగ్, బ్రహ్మోస్ క్షిపణి తయారీ కర్మాగారం, కురుమూర్తి దేవాలయ అభివృద్ధి, ఎంజీకేఎల్ఐ, లక్ష్మీదేవిపల్లి, అజిలాపూర్ ఎత్తిపోతల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, పరిహారం అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ రూరల్, భూత్పూర్, దేవరకద్ర మండలాల్లో భూసేకరణ పురోగతిని సమీక్షించిన కలెక్టర్ అవార్డుల ప్రక్రియ, పరిహారం చెల్లింపులు, ఖాతా ధ్రువీకరణ, న్యాయస్థాన కేసులు, వివాదాస్పద భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, కోర్టు కేసులు, ఇతర వివాదాలను స్పష్టంగా వర్గీకరించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. కోర్టు కేసులకు సంబంధించిన ఓఎస్ నంబర్లను నివేదికల్లో తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. భూత్పూర్ మండలంలో జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం చేసుకుని భూ యజమానులతో సమావేశం నిర్వహించి వారి అభ్యంతరాలను నమోదు చేసి పరిష్కరించాలని



ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వచ్చే వారంలోగా స్థానికులతో సమావేశం నిర్వహించి తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. రైల్వే లైన్ డబ్లింగ్, స్టేషన్ల విస్తరణకు అవసరమైన భూముల గుర్తింపు, సరిహద్దు గుర్తులు, భూ యజమానుల వివరాలు, అవార్డులు, పరిహారం చెల్లింపులపై కూడా కలెక్టర్ సమీక్షించారు. మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సరిహద్దు గుర్తుల ప్రక్రియను, భూసేకరణ దస్త్రాల్లోని అస్పష్టతలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అవార్డులు జారీ అయిన ప్రాంతాల్లో పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని సూచించారు. బ్రహ్మోస్ క్షిపణి తయారీ కర్మాగారం కోసం భూసేకరణపై సమీక్షిస్తూ ప్రభుత్వ భూముల సర్వే పూర్తయినందున ప్రైవేట్ భూముల సర్వేను అదనపు సర్వేయర్లను నియమించి పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అమర్‌రాజా పరిశ్రమకు రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కురుమూర్తి దేవాలయ అభివృద్ధికి అవసరమైన భూముల సర్వే పూర్తయినందున భూసేకరణ ప్రతిపాదనలు, నివేదికలను త్వరగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పట్టా భూములపై జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి భూ యజమానుల అభ్యంతరాలను పరిశీలించి, ప్రస్తుత ధరల ఆధారంగా పరిహారాన్ని ఖచ్చితంగా లెక్కించాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణలో సర్వే, ఎస్‌డీఆర్ సమర్పణ, పరిహారం చెల్లింపుల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టులో సర్వే, ఎస్‌డీఆర్ పూర్తయిన భూములకు పరిహారం చెల్లింపు దస్త్రాలను వెంటనే సిద్ధం చేయాలని, అజిలాపూర్ ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణ పురోగతిని రోజువారీగా పర్యవేక్షించి పరిహారం చెల్లింపులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద నిర్వాసితులకు అందించాల్సిన పునరావాసం, పరిహారం కార్యక్రమాలపై కూడా సమీక్షించారు. భవిష్యత్ అవసరాలకు సరిపడా నిధులను ముందుగానే అంచనా వేసి, ప్రాజెక్టుల వారీగా నిధుల అవసరం, చెల్లింపులు, మిగులు మొత్తాల వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో ఏ దశలోనూ జాప్యం జరగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, ఆర్డీఓ నవీన్, నీటిపారుదల శాఖ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల హక్కుల కోసం సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్'

## లక్ష మందితో మహాధర్నాకు టీజీ జాక్ పిలుపు..
## పెండింగ్ బకాయిలు, 6 డీఏలు, పీఆర్సీ అమలుపై ఆందోళన

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ): ఉద్యోగుల హక్కులు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీ జాక్ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు మహబూబ్‌నగర్‌లోని





టీఎన్జీవో భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీజీ జాక్ రాష్ట్ర నాయకులు మారం జగదీష్, ఏలూరి శ్రీనివాసరావు, ముజీబ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా టీజీ జాక్ మహబూబ్‌నగర్ జిల్లా చైర్మన్ డాక్టర్. రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు కోరుతున్నవి గొంతెమ్మ కోరికలు కాదని, తమ హక్కులకు సంబంధించిన న్యాయమైన డిమాండ్లేనని అన్నారు. ఉద్యోగులు పదవీ విరమణ చేసిన అనంతరం అందాల్సిన మొత్తాలు సకాలంలో అందడం లేదని, పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిన బకాయిలేనని పేర్కొన్నారు. ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హెల్త్ కార్డు వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. హెల్త్ కార్డులు ఉన్నప్పటికీ సరైన వైద్యం అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ అమలులో జాప్యం, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటం, ఇతర ఆర్థిక ప్రయోజనాలు అందకపోవడం వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు కోటీశ్వరులు కాదని, వారి ఆర్థిక పరిస్థితులను ప్రభుత్వం అర్థం చేసుకుని పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి లక్ష మంది ఉద్యోగులతో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 13 లక్షల మంది ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం తమ పోరాటం గాంధేయ మార్గంలోనే కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఇది ఎలాంటి కాయకల్ప చికిత్స కాదని, ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ప్రజాస్వామ్య ఉద్యమమని పేర్కొన్నారు. అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి ఉద్యోగులు తమ వంతు సహకారం అందించేందుకు అవసరమైతే అదనంగా గంట సమయం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని నాయకులు తెలిపారు. అయితే ఉద్యోగుల హక్కులు, ఆర్థిక ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం కూడా సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. వచ్చే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగుల సమస్యలను విస్మరించిన వారి పట్ల తమ వైఖరిని స్పష్టంగా తెలియజేస్తామని నాయకులు హెచ్చరించారు. సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

# నిరంజన్‌రెడ్డి.. ముందు మీ రికార్డు చూసుకోండి!

## మేఘారెడ్డిపై ఆరోపణలకు ఆధారాలు చూపండి
## 3 ఎకరాల కొనుగోలు.. అదనపు భూమి కబ్జా ఆరోపణలు!
## రూ.1.13 కోట్ల పన్ను ఎగవేతపై సమాధానం చెప్పాలి!
## బురదజల్లితే.. గత భూ లెక్కలు బయటపెడతాం!: కాంగ్రెస్ నేతల సవాల్

వనపర్తి, సెప్టెంబరు 3 (ప్రజాజ్యోతి): ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపై ఆరోపణలు చేసే ముందు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తన హయాంలో జరిగిన భూ వ్యవహారాల రికార్డును పరిశీలించుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు.



గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేఘారెడ్డిపై చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉంటే ఆధారాలతో ప్రజల ముందుకు రావాలని, లేనిపక్షంలో తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సవాల్ చేశారు. పెద్దమందడి మండలం వెల్టూరు శివారులోని భూముల వ్యవహారంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. గ్రామానికి చెందిన దానయ్య భూమిని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి ద్వారా మేఘారెడ్డి కొనుగోలు చేశారని, అనంతరం ఆ భూమి విక్రయంలోనూ ఆయనే ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. భూమి లావణీ పట్టా కాదని, 1987 నుంచి 2019 వరకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. మరోవైపు వెల్టూరు శివారులోని సర్వే నంబర్లు 345, 446లో కుమ్మరి వర్గానికి చెందిన భూముల విషయంలో మాజీ మంత్రి కుటుంబంపై కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేశారు. కుమ్మరి నాగన్న వద్ద నుంచి నిరంజన్‌రెడ్డి వదిన పేరిట 3 ఎకరాల 19 గుంటల భూమిని కొనుగోలు చేసి, మరో 8 ఎకరాల 6 కుంటల భూమిని ఆక్రమించుకున్నారంటూ ఆరోపించారు. గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకుని సుమారు రూ.1.13 కోట్ల ప్రభుత్వ పన్ను ఎగ్గొట్టారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై నిరంజన్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. "మేఘారెడ్డిపై ఫిర్యాదు చేయాలనుకుంటే భూమి కొనుగోలు, విక్రయాల్లో కీలకంగా వ్యవహరించిన రఘుపతిరెడ్డి పాత్రపైనా విచారణ జరపాలి. ఆరోపణలకు ఆధారాలు చూపాలి" అని కాంగ్రెస్ నేతలు అన్నారు. దళితుల భూముల పేరుతో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు కూడా నిరాధారమని వారు ఖండించారు. ఆరోపణల్లో ఒక్క శాతం నిజం ఉన్నా ఆధారాలతో నిరూపించాలని, లేకపోతే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "రాజకీయంగా ఎదుర్కోలేక మేఘారెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. దమ్ముంటే ఆధారాలతో ప్రజల ముందుకు రండి. మీ హయాంలో జరిగిన భూ వ్యవహారాలపై కూడా మేము ఆధారాలతో ప్రజాక్షేత్రంలోకి వస్తాం" అని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వాల్య నాయక్, పెద్దమందడి మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, వనపర్తి మండల అధ్యక్షుడు రవికిరణ్ యాదవ్, గంధం రంజిత్‌కుమార్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# దయానంద విద్యా మందిర్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

గద్వాల సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి ప్రతినిధి): గద్వాల పట్టణంలోని దయానంద విద్యా మందిర్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలో అలరించడంతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది.విద్యార్థులకు శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతతో పాటు శ్రీకృష్ణుడి జీవితం,ధర్మబోధనలు,సత్ప్రవర్తన,నైతిక విలువలను సులభంగా అర్థమయ్యేలా వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ స ంస ్కృతి, స ంప్రదాయాల్లో కృష్ణాష్టమికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి ఏడాది పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తూ విద్యార్థులకు మనసంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.చిన్నారుల శ్రీకృష్ణ, గోపికల వేషధారణలు,సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థినులు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రాఖీ రద్దీలో రికార్డు రాబడి.. వనపర్తి డిపోకు 137% ఓఆర్!

## ఉద్యోగుల సమిష్టి శ్రమతో ఆదాయంలో అదరగొట్టిన డిపో!

వనపర్తి, సెప్టెంబరు 3 (ప్రజాజ్యోతి): ఆగస్టు నెలలో వనపర్తి డిపో 100 శాతం ఓఆర్ సాధించడం కూడా ఉద్యోగుల సమిష్టి కృషికి నిదర్శనమని డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం వనపర్తి ఆర్టీసీ డిపో ప్రాంగణంలో డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ గేట్ మీటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి సందర్భంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్స్‌లో వనపర్తి ఆర్టీసీ డిపో ఉద్యోగులు సమిష్టిగా కృషి చేసి 137 శాతం ఓఆర్ (ఆపరేటింగ్






రేషియో) సాధించారనీ తెలిపారు. పండుగ సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సర్వీసు బస్సులను పూర్తిస్థాయిలో నడపడమే కాకుండా, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు ట్రిప్పులు నిర్వహించి అధిక ఆదాయం సమకూర్చారని ఆయన ప్రకటించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా విధులు నిర్వహిస్తూ అదనపు ట్రిప్పులు నడిపి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు అధిక ఆదాయం సాధించిన డ్రైవర్లు, కండక్టర్లు, మెయింటెనెన్స్ సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఇతర ఉద్యోగులను అభినందించారు. ఆర్టీసీ ఎండీ ఆదేశాల మేరకు రాఖీ స్పెషల్ ఆపరేషన్స్‌లో విధులు నిర్వహించిన ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేసి వారి సేవలను ప్రశంసించారు. అలాగే మహాలక్ష్మి పథకం ద్వారా వచ్చిన ఆదాయాన్ని కలుపుకొని రాఖీ పౌర్ణమి రోజున నమోదైన ఆదాయంతో డిపో ఈ ఘనత సాధించిందని తెలిపారు. ఉద్యోగులందరూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ పనిచేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయకృష్ణ, కృష్ణ, ఎస్‌డీఐ కృష్ణ, కంట్రోలర్లు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

గద్వాల,సెప్టెంబర్ 3(ప్రజా జ్యోతి ప్రతినిధి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను





ఈవీఎంల నెలవారీ సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు.ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోడౌన్‌లోని ఈ వీఏ ంలు, బ్యాలెట్ యూనిట్ల భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు.ఈవీఎంలు,బ్యాలెట్ యూనిట్ల భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులు,సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.గోడౌన్ భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు మంజులతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పట్ల సవితి తల్లి ప్రేమ చూపిస్తున్న కాంగ్రెస్

- రైతు లేనిదే రాజ్యం లేదు - రైతు సంక్షేమమే బిఆర్ఎస్ పార్టీ ధ్యేయం
- రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పతనం కాయం - బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహా రావు
- ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి








**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతోందని,రైతు లేనిదే రాజ్యం లేదని బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం గోవిందరావు పేట మండలకేంద్రంలో బిఆర్ఎస్ పార్టీనాయకులు రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి,జంపన్న ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీ పాల్గొన్నారు. గోవిందరావుపేటలోని తహశీల్దార్ కార్యాలయం నుండి ఎడ్ల బండ్లతో మొదలైన ర్యాలీ గోవింద రావుపేట శివారులోని ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడారు.బిఆర్ఎస్ పార్టీ రైతుల సంక్షేమమే ధ్యేయంగా రెండు దఫాలుగా పాలన అందించిందని అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ఖాయ మని అన్నారు.ముఖ్యంగా ములుగు నియోజకవర్గ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, స్థానిక మంత్రి తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలకు పరిష్కారం చూపకుండా సభలు, సమావేశాలు, ఉపన్యాసాల పేరుతో కాలయాపన చేస్తూ,ప్రతి సమస్యకూ గత ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చు కునే ప్రయత్నం చేస్తోందని వారు ఆరోపించారు.

**లక్నవరం సమస్యపై హామీ ఏమైంది ? :** ములుగు ప్రాంత రైతాంగానికి లక్నవరం జలాశయం అత్యంత కీలకమైన సాగునీటి వనరు అని,దాని కింద ఉన్న పంట పొలాలకు అవసరమైన సమయంలో నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లక్నవరం సమస్యను పదే పదే ప్రస్తావించిన మంత్రి సీతక్క నేడు అధికారం లోకి వచ్చిన తర్వాత దాని పరిష్కారానికై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. మేడారం సమ్మక్క- సారలమ్మ తల్లుల సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్నవరం నీటిని జంపన్న వాగుతో అనుసంధానం చేసేందుకు రూ.36 కోట్లతో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని,ఆ హామీ అమలుపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం రైతాంగాన్ని నిరాశకు గురిచేస్తోందని అన్నారు.రైతుకు ప్రాజెక్టుల పేర్లు, హామీలు కాకుండా పంట కాలంలో పొలానికి చేరే నీరే ముఖ్యమని, అందువల్ల లక్నవరం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే కార్యాచరణను ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

**పంట నష్టపరిహారంపై లెక్కలు చెప్పాలి :** 2024లో కురిసిన వడ గండ్ల వానలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు చొప్పున పరిహారం ప్రకటించారని,ములుగు ప్రాంతానికి సంబంధించి రూ.5.75 కోట్ల నిధులు విడుదలయ్యాయని వారు తెలిపారు.అయితే ఆ నిధులు రైతులకు చేరకుండా ఏక్కడికి చేరాయనే విషయాలను ప్రభుత్వం,మంత్రి సీతక్క ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.రైతు పేరుతో విడుదలైన నిధుల విషయంలో పారదర్శకత ఉండాలని,అర్హులైన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**రైతు భరోసా విషయంలో స్పష్టత ఎక్కడ..? :** ఎన్నికల సమయంలో రైతు పెట్టుబడి సాయాన్ని పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని వారు గుర్తుచేశారు.హామీకి అనుగుణంగా రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం అందడం లేదని వారు విమర్శించారు.వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడి సాయం రైతుకు ఎంతో కీలకమని అన్నారు. విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు,కూలీల ఖర్చులు పెరిగిన నేటి పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం ఆలస్యం కావడం చిన్న,సన్నకారు రైతులపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతుందని అన్నారు. అందువల్ల రైతు భరోసా అమలుపై ప్రభుత్వం స్పష్ట మైన విధానం ప్రకటించి, అర్హులైన రైతులందరికీ సమయానికి ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు.

**ధాన్యానికి గిట్టుబాటు ధర ఎక్కడ..? :** రైతు పంట పండించడం మాత్రమే కాకుండా దానిని సరైన ధరకు విక్రయించ గలిగినప్పుడే వ్యవసాయం ఆర్థికంగా నిలదొక్కు కుంటుందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో గిట్టుబాటు ధర లభించకపోవడం, ప్రకటించిన బోనస్ సైతం సమయానికి అందక పోవడం రైతులకు నష్టాన్ని కలిగిస్తోందని వారు విమర్శించారు.ప్రకటనలకే పరిమితం కాకుండా బోనస్ ఎప్పుడు చెల్లిస్తారని,అర్హులైన రైతులు ఎంతమంది,ఎంత మొత్తం విడుదల చేశారనే వివరాలను సైతం ప్రభుత్వం వెల్లడించాలని కోరారు.

**సమ్మక్క బ్యారేజ్, దేవాదుల నీటిని వినియోగించాలి :** ములుగు జిల్లాలో సాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు గతంలో చేపట్టిన దేవాదుల, సమ్మక్క బ్యారేజ్ వంటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాల సూచించారు.సమ్మక్క బ్యారేజ్ ద్వారా నీటిని నిల్వచేసి ములుగు జిల్లా లోని వివిధ మండలాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ, ఆ వనరులను సమర్థవంతంగా వినియోగించడంలో ప్రభుత్వం విఫలమవు తోందని ఆరోపించారు.

ఇక్కడ రాజకీయ విమర్శల కంటే ముఖ్యమైంది ప్రాజెక్టుల సామర్థ్యాన్ని ఎంతవరకు వినియోగిస్తు న్నారన్నదే ముఖ్యమని అన్నారు.ఎంత ఆయకట్టు కు నీరందుతోంది,ఇంకా ఎంత భూమికి నీరు అందించాల్సి ఉంది, అందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి అనే వివరాలను ప్రజలకు తెలుపాల్సిన అవసరం ఉందని విమర్శించారు.

**పోడు భూముల సమస్యకు పరిష్కారం కావాలి :** ములుగు జిల్లాలో పోడు భూముల సమస్య ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. భూమిపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు హక్కుల విషయంలో స్పష్టత కల్పించడం అత్యవసరం అని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం అర్హులైన గిరిజన,గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.పట్టాల సమస్య పరిష్కారమైతే రైతులకు భూమిపై చట్ట బద్ధమైన హక్కుతో పాటు వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ పథకాలు,పెట్టు బడి సాయం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం మెరుగుపడు తుందని అన్నారు.ఈ అంశాన్ని రాజకీయ ప్రకటనలకు పరిమితం చేయకుండా స్పష్టమైన విధానంతో పరిష్కరించాలని వారు కోరారు.

**గత ప్రభుత్వాన్ని విమర్శించడం పాలనకు ప్రత్యామ్నాయం కాదు :** ప్రస్తుత ప్రభుత్వం ప్రతి సమస్యకు గత ప్రభుత్వాన్ని బాధ్యుడిగా చూపడం వల్ల సమస్యలు పరిష్కారం కావని వారు విమర్శించారు.గత ప్రభుత్వంలో తప్పులు జరిగి ఉంటే వాటిపై విచారణ జరిపించడం ప్రభుత్వ హక్కు. అయితే అదే సమయంలో ప్రస్తుత పాలనపై ప్రజలకు జవాబుదారీతనం గా ఉండాలని వారు అన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం రాజకీయ వాదన కావచ్చని,కానీ ప్రస్తుత సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్న నేపథ్యంలో ఇప్పటికీ గత పాలననే ప్రధాన రాజకీయ అంశంగా చేసుకోవడం కంటే,తమ ప్రభుత్వం సాధించిన ఫలితాలపై ప్రజలకు లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. ములుగు రైతాంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు పరస్పరం అనుసంధానమైనవేనని, సాగునీరు లేకపోతే పంట నష్టపోతారని అన్నారు. పంట పండినా సరైన ధర లేకపోతే ఆదాయం తగ్గుతుందని,ప్రకృతి వైపరీత్యం వస్తే పరిహారం ఆలస్యం అయితే అప్పులు పెరుగుతాయని ఆరోపించారు.భూమిపై హక్కు లేకపోతే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడం కష్టమవుతుంది అని అన్నారు.కాబట్టి రైతు సమస్యలను విడివిడిగా కాకుండా నీరు - పెట్టుబడి - పంట ధర - పరిహారం - భూ హక్కులు అనే సమగ్ర వ్యవసాయ విధానంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను గల్లి గల్లికి ఎండగడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గోవింద నాయక్,మల్క రమేష్, భూక్య జంపన్న,లకావత్ నరసింహ,సూడి శ్రీనివాస్ రెడ్డి,లకావత్ చందులాల్, తాటికొండ శ్రీనివాసాచారి, గజ్జి ఏలేందర్,పిన్నింటి మధుసూదన్ రెడ్డి, అక్కన పల్లి రమేష్,మేడుదుల వెంకన్న,వర్ధన్ చందర్,చర్ల పాండు,ప్రవీణ్ గౌడ్,బి.శీను,శ్యామ వెంకట్ రెడ్డి, ఎడవెల్లి వెంకటరెడ్డి,నామ పూర్ణచందర్,అజ్మీరసురేష్,మాలోత్ గాంధీ,పోరిక కిరణ్,కుమార్,లావుడ్య రామచందర్,స్వరూప, లకావత్ మమత,చందు లాల్,సమ్మక్క,ధరావత్ రాకేష్,చిలుకూరి రాజ్ కుమార్,కత్తుల సారయ్య, నామాల మురళి,వాసం శివాజీ,ఏకుల ధనుంజయ, సూడి సతీష్ రెడ్డి,బొజ్జ నరేందర్,సొరపాక లక్ష్మీ నారాయణ,జల్లెల కొము రయ్య,చల్లూరి రామకృష్ణ, గుమ్మడి ప్రసాద్,బత్తుల రాణి,రుద్రపు రాజశేఖర్, సమ్మయ్య,పూలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం చల్లా పోరుబాట

- దామెర నుండి నడికూడ వరకు ఎస్సారెస్పీ కాలువలో పాదయాత్ర
- వర్షంలోనూ కొనసాగిన పాదయాత్ర
- మంగళ హారతులతో ఘన స్వాగతం పలికన మహిళలు,రైతులు
- ఎడ్లబండ్లతో..ట్రాక్టర్లతో భారీ ర్యాలీ
- 420 హామీలతో మోసం.. రైతుల కన్నీటికి సమాధానం చెప్పాల్సిందే
- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**పరకాల, సెప్టెంబర్ 03,(ప్రజా జ్యోతి) :** రైతుల కన్నీటి గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల దగా పాలనలో రైతులను ఇచ్చిన హామీలతో మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. గురువారం దామెర మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాలువ నుంచి నడికూడ శివారు వరకు రైతులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో భారీ ర్యాలీ చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ 420 హామీలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీ ఏమైందని, రైతుభరోసా కింద ఇస్తామన్న రూ.15 వేలు ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు.



రైతుబంధును సీరియల్‌లా సాగదీస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కౌలు రైతులకు ఇస్తామన్న రూ.12 వేల భరోసా, వరి పంటకు ప్రకటించిన రూ.500 బోనస్, రైతుబీమా హామీల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.యూరియా కోసం రైతులు రోజుల తరబడి ఇబ్బందులు పడుతూ, చెప్పులు లైన్లో పెట్టుకునే దుస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై పోలీసులతో లాఠీచార్జీలు చేయించడం దారుణమన్నారు."రైతు ఓటు కోసం హామీలు ఇవ్వడం కాదు.. రైతు పొలంలో పంట పండే వరకు ప్రభుత్వం అండగా నిలవాలి. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర, పెట్టుబడికి భరోసా, కష్టకాలంలో బీమా, అప్పుల్లో ఉన్నప్పుడు రుణమాఫీ.. ఇవే రైతుకు కావాల్సిన నిజమైన భరోసా" అని చల్లా ధర్మారెడ్డి అన్నారు.బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ పాలనలో రైతు రాజులా బతికితే.. నేడు రేవంత్ రెడ్డి పాలనలో యూరియా కోసం చెప్పులు లైన్లో పెట్టుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. రైతును మోసం చేయడం అంటే ఒక వ్యక్తిని మాత్రమే



కాదు.. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన రైతు కుటుంబాన్ని మోసం చేయడమేనన్నారు."రైతు చేతిలో నాగలి ఉండాలి.. కాంగ్రెస్ హామీల చీటీ కాదు. రైతు ఓట్లతో అధికారంలోకి వచ్చి రైతులనే మోసం చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరు" అని హెచ్చరించారు.

రేవంత్ రెడ్డి హామీలకు లెక్క లేదని, అమలుకు దిక్కు లేదని, రైతు సమస్యలకు పరిష్కారం లేదని చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. రైతుల కన్నీటికి సమాధానం చెప్పే రోజు వస్తుందని, ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి లెక్క చెబుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధికార ప్రతినిధిగా బొమ్మకంటి రమేష్ వర్మ నియామకం



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్(ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధికార ప్రతినిధిగా బొమ్మకంటి రమేష్ వర్మ నియామకమయ్యారు.ఈమేరకు పంచాయతీ రాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాలమేరకు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా తనను నియమించినందుకు మంత్రి సీతక్కకు,ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ కు,హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ములుగు జిల్లా అధికార ప్రతినిధిగా తనపై నమ్మకం ఉంచిన పార్టీ కోసం పార్టీ నాయకత్వం కోసం పనిచేస్తానని రమేష్ వర్మ అన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులకు,ప్రజా ప్రతినిధులకు కార్యకర్తలకు బంధు మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. మంత్రి సీతక్క,ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలమేరకు ఎల్లప్పుడూ తన వంతుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బొమ్మకంటి రమేష్ వర్మ తెలిపారు.

## లహరి పాఠశాలలో ఘనంగా ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

కరస్పాండెంట్ రవిచందర్



**రాయపర్తి సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని లహరి పబ్లిక్ స్కూల్లో గురువారం ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ టి.రవిచం దర్ విద్యార్థులతో కృష్ణుడు, గోపికలు, యశోదల వేషధారణలతో, కోలాటాలతో, ఆటపాటలతో, ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కృష్ణులుగా షణ్ముఖ నందన్, శ్రీయాన్ష్, అశ్విన్, శాన్విష్, కార్తీక్, రియాన్సిక, శ్రీకర్, డి రిత్విక్, యు రిత్విక్, వర్షిత్, వికిందర్, హఫీస్ పాషా, రాజేందర్, యశోద గా డి తేజశ్రీ గోపికలుగా కే రిషిక, పి నిక్షిత, ఎం శ్రీనిక, క్రతీక, తన్విక, ఎం మనుశ్రీ, కే శ్రణవి, జి శ్రీవిద్య, ఎండి హదియా, సహెరా, బి రశ్మిత, ఎండి రింషా, శరణ్య, యు రిషిక, నక్షత్ర, బి.నిత్యశ్రీ, జె.రాజేశ్వరి, వర్షిత, ఎన్ రాజేశ్వరిలు వేషధారణ లతో పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమారాణి, ఉపాధ్యాయులు జ్యోతి, స్వర్ణలత, స్రవంతి, శ్వేత, రవళి పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన సూర్య



**ములుగు సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి) :** ములుగు మండలం కన్నాయిగూడెం గ్రామానికి చెందిన గోగ్గలి బుచ్చయ్య అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య బుచ్చయ్య కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బండి మధు, మండల ప్రధాన కార్యదర్శి రాజేష్, జాయింట్ సెక్రటరీ నాలి వివేక్, సెక్రటరీ ఒరిగంటి సురేందర్, కన్నాయిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం రాకేష్, గ్రామ ఉపాధ్యక్షులు పాయం పాపయ్య గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దెబ్బ కట్ల మధు, ఉపాధ్యక్షుడు ప్రకాష్, జనరల్ సెక్రటరీ వెంకటేష్, సెక్రటరీ పవన్ కళ్యాణ్, పబ్లిసిటీ సెక్రటరీ తరుణ్, సోషల్ మీడియా దీపక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్ నోటీసుల పంపిణీని క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన ఆర్‌డీఓ.



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 3 :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ లో భాగంగా భూపాలపల్లి పట్టణంలో కొనసాగుతున్న నోటీసుల పంపిణీ ప్రక్రియను భూపాలపల్లి ఆర్‌డీఓ హరికృష్ణ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. పట్టణంలోని 44వ పోలింగ్ కేంద్రం పరిధిలోని రెడ్డి కాలనీలో నోటీసుల పంపిణీ తీరును ఆర్‌డీఓ తనిఖీ చేసి, నోటీసులు అందుకున్న ఓటర్లతో మాట్లా డారు. సర్ ప్రక్రియలో అర్హత కలిగిన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు, నోటీసులో కోరిన అంశాలకు అనుగుణంగా సంబంధిత ఆధార పత్రాలను గడువులోగా సమర్పించాలని సూచించారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో సూపర్‌వైజర్ జితేందర్, బి.ఎల్.ఓ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రి నుంచి రాగానే పోలీసుల దాడి..

- బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**పరకాల, సెప్టెంబర్ 03, (ప్రజా జ్యోతి) :** నడికూడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన ఆల్లె సందీప్‌పై పోలీసులు దాడి చేయడం దారుణమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆరోపించారు. కుటుంబ సభ్యుల మధ్య జరిగిన గొడవలో గాయపడిన సందీప్ ఆస్పత్రిలో చికిత్స అనంతరం గురువారం గ్రామానికి రాగా, పరకాల పోలీసులు అతడిని ప్రశ్నించి తీవ్రంగా కొట్టారని పేర్కొన్నారు. పోలీసుల దాడిలో మళ్లీ గాయపడిన సందీప్‌ను పోలీసులే పరకాల ఏరియా ఆసుపత్రిలో ఆస్పత్రిలో చేర్పించారని తెలిపారు.ఘటనపై వరంగల్ సీపీ సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. సందీప్‌కు మెరుగైన వైద్యం అందించి న్యాయం చేయాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో అమలైన 'ఫ్రెండ్లీ పోలీసింగ్'కు భిన్నంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసుల వ్యవహారశైలి మారిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## కుడా చైర్ పర్సన్‌గా మాజీ మేయర్ గుండు సుధారాణి



**హన్మకొండ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03, (ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాజకీయాల్లో కీలక సామాజిక సమీకరణలకు శ్రీకారం చుట్టింది. మాజీ మేయర్, మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వరంగల్ జిల్లాకు చెందిన కీలక నాయకురాలు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చిన నేపథ్యంలో పద్మశాలి సామాజిక వర్గంలో నెలకొనే అసంతృప్తిని తృప్తి పరిచేందుకే కాంగ్రెస్ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. పద్మశాలి సమాజానికి చెందిన గుండు సుధారాణి గతంలో రాజ్యసభ సభ్యురాలిగా, వరంగల్ మేయర్‌గా విశేష సేవలు అందించారు. అదే సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండా సురేఖ స్థానంలో బిసి-పద్మశాలి వర్గానికే చెందిన మరో సీనియర్ నాయకురాలికి ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గం మద్దతు తగ్గకుండా చూసుకునేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలన సంబరాలు

హనుమకొండ చౌరస్తాలో టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకున్న కాంగ్రెస్ శ్రేణులు



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03, (ప్రజా జ్యోతి) :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ చౌరస్తాలో సంబరాలు నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రహదారిపై టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తోందంటూ నినాదాలు చేశారు.ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ఆరు గ్యారెంటీల అమలు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, రైతులకు రుణమాఫీ వంటి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. గత పాలనకు భిన్నంగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాపాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొందన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, డీసీసీ మీడియా కమిటీ చైర్మన్ మార్క విజయ్‌కుమార్‌గౌడ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పీసీసీ, డీసీసీ కమిటీల సభ్యులు, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 5న నకిరేకల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

**– సభ ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం**





**నకిరేకల్, సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సెప్టెంబర్ 5న నకిరేకల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు హాజరుకానున్న నేపథ్యంలో, నకిరేకల్ మినీ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం పరిశీలించారు. సభా ప్రాంగణంలో వేదిక నిర్మాణం, తాగునీటి సౌకర్యం, పార్కింగ్, విద్యుత్, భద్రత తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.

భారీ సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్, పోలీస్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వేముల వీరేశం కోరారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**చిట్యాల మార్కెట్‌యార్డులో పాల శీతలీకరణ కేంద్రం ప్రారంభం**





**చిట్యాల, సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి :** చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలోని మార్కెట్‌యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారులైన రైతులకు రూ.20 లక్షల విలువైన చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నూతన శీతలీకరణ కేంద్రం అందుబాటులోకి రావడంతో చిట్యాల పరిసర ప్రాంతాల పాడి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. పాల నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుందన్నారు.

కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్రా వినోద్–మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పందిరి గీత–రమేష్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



**చింతపల్లి సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** చింతపల్లి మండలంలోని కుర్మేడు గేటు సమీపంలో ఉన్న నవోదయ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా చిన్నారులు శ్రీ కృష్ణ, గోపికలు వేషధారణలతో అలరించారు. అంగరంగ వైభవంగా ఉట్టికొట్టి వివిధ సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆనంతుల జంగయ్య గౌడ్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు వంశీకృష్ణ, పాండు, వెంకటేష్, సంధ్యారాణి, కావ్య, మమత, మాలతి, అమీన్, స్వప్న, మౌనిక, శ్రావణి, రాణి, స్వపతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వల్లాల ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ



**శాలిగౌరారం, సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి :** శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ భూపతి తిరుపతమ్మ ఉపేందర్ గౌడ్ విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్య ఎంతో అవసరమని, అందరూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం పాఠశాలలో ఎల్పీజీ గ్యాస్‌తో మధ్యాహ్న భోజన పథకాన్ని సర్పంచ్ భూపతి తిరుపతమ్మ ఉపేందర్ గౌడ్, ఉప సర్పంచ్ రాగి దావీదు, వార్డు సభ్యులు ప్రారంభించారు. ఇకపై విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎల్పీజీ గ్యాస్‌ను వినియోగించి వండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, మధ్యాహ్న భోజన వంట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాలిగౌరారం పాఠశాలల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీ





**శాలిగౌరారం, సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి :** నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారి పి.సుశీందర్ రావు గురువారం శాలిగౌరారం మండలంలోని జి.పి.యు.పి. పాఠశాల శాలిగౌరారం, ఎంపీపీఎస్ శాలిగౌరారం, భవిత కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, బోధన తీరును పరిశీలించారు. ఎంపీపీఎస్ శాలిగౌరారంలోని విద్యార్థులందరికీ ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం మార్గదర్శకాల ప్రకారం బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జెడ్పీహెచ్ఎస్ శాలిగౌరారంలోని విద్యార్థులందరికీ గణితంలో ప్రాథమిక అంశాలపై పట్టు సాధించేలా చర్యలు చేపట్టాలని, తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలను స్పష్టంగా, సులభంగా చదివేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన బోధనా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించిన డీఈఓ అక్కడి రికార్డులను పరిశీలించి, వాటిని ఎప్పటికప్పుడు నవీకరించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

## ప్రజాపాలన 1000 రోజుల సందర్భంగా బైక్ ర్యాలీ

**– కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లపాటి శ్రీనివాసరావు**





**మునగాల సెప్టెంబర్03 (ప్రజాజ్యోతి):** ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మునగాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు తెలియజేస్తూ బైక్ ర్యాలీ నిర్మించారు. అనంతరం మండల కేంద్రంలో నీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నిరుపేదలు సన్న బియ్యం, ఉచిత కరెంట్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఉచిత బస్ ప్రయాణం లాంటి పథకాలు ప్రజలు పొందుతున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కాసర్ల శీను,మండల పార్టీ అధ్యక్షులు, కాసర్ల కోటయ్య, ఉపసర్పంచ్ కాసర్ల వెంకట్, గ్రామ శాఖ అధ్యక్షులు ఈదరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయి, శెట్టి గిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు ప్రతి పేద కుటుంబం సొంత కల







- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు**
- **ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03(ప్రజా జ్యోతి) :** ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య,జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.గురువారం సూర్యాపేట మండలం రామచంద్రపురం గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డితో కలిసి వీర్ల మౌనిక--రామచంద్రారెడ్డి, భూపతి ఉపేంద్ర--సైదులు కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.నూతన గృహాల్లో గృహప్రవేశం చేసిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ పేద,మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నూతన గృహాల్లో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, సర్పంచ్ గోడదాటి కావ్య సతీష్, ఉపసర్పంచ్ లింగయ్య, మాజీ సర్పంచులు మాలి కవిత అనంతరెడ్డి, మండల్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డి, బొడ్డు మల్లయ్య, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల అంజయ్య, మాజీ ఎంపీటీసీ బండి ప్రభాకర్ రెడ్డి, నాయకులు నల్లగంటి నర్సయ్య, కొప్పుల లక్ష్మారెడ్డి, చివ్వెంల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దారావత్ వీరన్న నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ చిలుముల సునీల్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుగులోతు నాగునాయక్, పడిదల రవి, గుంటూరు చిట్టిబాబు, దుబ్బాక ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై బిఆర్ఎస్ అసత్య ప్రచారం



**తుంగతుర్తి, సెప్టెంబర్ 3(ప్రజా జ్యోతి) :** వెయ్యి రోజుల ప్రజాపాలనలో తుంగతుర్తి నియోజకవర్గం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తుంగతుర్తి అభివృద్ధి ప్రదాత స్థానిక శాసనసభ్యులు మండల సామెల్ ఆధ్వర్యంలో అన్ని రంగాలలో పురోగతి సాధిస్తూ విజయ పరంపర కొనసాగిస్తుందని కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి మండల కమిటీ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్ అన్నారు. గురువారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రేగటి రవి గౌడ్,తిరుమలగిరి మండల కమిటీ అధ్యక్షుడు సుంకరి జనార్దన్, సింగల్ విండో ఛైర్మన్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చింతకుంట్ల వెంకన్న, జిల్లా నాయకులు ఎల్సోజు నరేష్ మాట్లాడుతూ.... వెయ్యి రోజుల పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ ఈ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించారు. దశ దిశల తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ట పెరిగేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రగతి పథంలో ముందుకు తీసుకెళుతున్నారని అన్నారు. గత 60 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి గా మద్దిరాల, నూతనకల్ మండలాల రైతులకు సుమారు 3000 ఎకరాల భూమి పట్టాలు ఇప్పించిన ఘనత ఎమ్మెల్యే సామెల్ ది అన్నారు. ఈ నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుంటే టిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. ఇప్పటికే ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే సామెల్ అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి బిఆర్ఎస్ నాయకులు ప్రజా పాలనను చూసి బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గుగులోతు స్వాతి భాస్కర్, గుగులోతు జ్యోతి రాము,జిల్లా నాయకులు మారగాని వెంకటయ్య, గ్రంధాలయ చైర్మన్ గంగరాజు,పోలేపాక రామచంద్రు, అనూక్, రేగటి వెంకటేష్, పెండెం రామ్మూర్తి,దాసరి శ్రీను, మహిళా మండల కమిటీ అధ్యక్షురాలు పులి సత్తెమ్మ, తప్పట్ల శంకర్, మాచర్ల అని, పెద్ద బోయిన అజయ్, కొండ రాజు, కొండ పరశురాం, భాష బోయిన వెంకన్న, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలకృష్ణుల సందడితో వెంపటి పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి

**రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారుల ఆకట్టుకునే ప్రదర్శనలు**







**తుంగతుర్తి, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి) :** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెంపటిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణ భక్తి గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు, రాధాకృష్ణుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భీవనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాలతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం విద్యలో ముఖ్యమని తెలిపారు. శ్రీకృష్ణుని జీవితం ద్వారా సత్యం, ధర్మం, ప్రేమ, స్నేహం, ధైర్యం వంటి విలువలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లెపాక రవీందర్, గట్టు మాధవి, బండారు భవాని, జీడి అనిల్ కుమార్, మిట్టగడుపుల విక్రం, గుండ్ల ఆంజనేయులు, మౌనిక, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం







**నకిరేకల్, సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి :** నకిరేకల్ పట్టణంలోని గుడిపాటి ఫంక్షన్ హాల్‌లో నకిరేకల్ మున్సిపాలిటీ, మండల పరిధికి చెందిన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సెప్టెంబర్ 5న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నకిరేకల్‌లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు.

రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నిరుపేదలకు రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాల నూతన భవనాలకు కూడా శంకుస్థాపనలు జరగనున్నాయని తెలిపారు.

నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ బియ్యం పొందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 1,000 రోజుల కాలంలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తదితర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికి కాంగ్రెస్ సంక్షేమ ఫలాలు

**స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సామెల్**





**తుంగతుర్తి, సెప్టెంబర్ 3, (ప్రజాజ్యోతి) :** ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గ్రామానికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే సామెల్ అన్నారు. గురువారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్, నాగారం, జాజిరెడ్డిగూడెం, తిరుమలగిరి మండలాల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, సన్నబియ్యం వంటి పథకాలను పేదలకు అందిస్తున్నామని తెలిపారు. దశాబ్దాలుగా భూములు పట్టాలు గాక అష్ట కష్టాలు పడ్డ మద్దిరాల, నూతనకల్ మండలాల రైతులకు ప్రజాప్రభుత్వంలో పట్టాలిప్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది, నాది అని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి ఐదు లక్షల రూపాయలతో ఇల్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ నాయకులు ఎవరికి ఇండ్లను నిర్మించారో తెలపాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ చామంతి నరేష్, తుంగతుర్తి , నూతనకల్ సింగిల్ విండో చైర్మన్లు గుడిపాటి సైదులు, నాగం జయసుధ,వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్, నాగారం, తిరుమలగిరి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేగటి రవి, పచ్చిపాల వెంకన్న, కట్ట మల్లారెడ్డి, వెంకట బిక్షం, సుంకరి జనార్ధన్, తుంగతుర్తి తహసిల్దార్ దయానందంతో పాటు వివిధ మండలాల ఎమ్మార్వోలు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## పీయం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలకు చెందిన బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన మండల విద్యాశాఖ అధికారి రాములు





సిరికొండ, ప్రజా జ్యోతి, సెప్టెంబర్, 2 సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతిగృహంలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఎంఈఓ రాములు గారు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి వసతి, భోజనం, చదువు, ఆరోగ్యం మరియు ఇతర సౌకర్యాల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.అలాగే విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత,వంటకాల తయారీ విధానం,వంటగది పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. వసతిగృహం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని,పరిసర ప్రాంతాల్లో మొలకెత్తిన పిచ్చిమొక్కలను తొలగించి ఆరోగ్యకరమైన మరియు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సిబ్బందికి సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన వసతి, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి అనుకూల పరిస్థితులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాములు,ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి,కేర్ టేకర్ ప్రశాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత యూనిఫామ్‌ల పంపిణీ

• విద్యార్థులకు అండగా ప్రభుత్వం.. ఆనందం వ్యక్తం చేసిన చిన్నారులు



బీర్కూర్, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 03: కిష్టాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ మానెవ్వ గంగొండ, ఉపసర్పంచ్ అట్కారి కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేశారు. యూనిఫామ్‌లు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయగా, తల్లిదండ్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మానెవ్వ గంగొండ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై విద్యా ఖర్చుల భారం తగ్గించేందుకు ఉచిత యూనిఫామ్‌లు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఉపసర్పంచ్ అట్కారి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.ప్రధానోపాధ్యాయురాలు లత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, సౌకర్యాల ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బాలమణి, వార్డు సభ్యుడు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు కొత్త యూనిఫామ్‌లతో సందడి చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసిన మండల ఉపాధ్యక్షులు మహిపాల్ నాయక్



ఇందల్వాయి (ప్రజా జ్యోతి), సెప్టెంబర్ 3: ఇందల్వాయి మండల కేంద్రంలోని జీకే తండా గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గురువారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి మండల ఉపాధ్యక్షులు మహిపాల్ నాయక్, గ్రామ సర్పంచ్ శిరీష, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షులు మహిపాల్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ రైతులు ఆశించిన స్థాయిలో ముందుకు వెళ్లలేకపోయారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, పేదల అభివృద్ధి, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇతరులపై విమర్శలు చేయడం మానుకుని, ప్రజల కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని మహిపాల్ నాయక్ సూచించారు. ఇకనైనా ఎదుటివారిపై విమర్శలు చేయకుండా తమ పనితీరుపై దృష్టి సారిస్తే మంచిదని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జమున పరశురాం ఉప సర్పంచ్ రజిత సుధీర్ స్థానిక నాయకులు, మహిళలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

• కృష్ణుడు, రాధ, రుక్మిణి వేషధారణలో చిన్నారుల సందడి • ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు.. ఉట్టికొట్టి సంబరాలు







నస్రుల్లాబాద్, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 3: నస్రుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామ శివారులోని గ్లోబల్ స్పార్క్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాల ఆవరణను ప్రత్యేకంగా అలంకరించి వేడుకలను నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులు, ఆకర్షణీయమైన వేషధారణలతో హాజరై వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, రుక్మిణి, గొల్లభామ తదితర వేషధారణల్లో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు ఆయా పాత్రలకు అనుగుణంగా చేసిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు తోటి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను, కార్యక్రమానికి హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు కృష్ణుడి బాల్య లీలలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఇవ్వడంతో పాఠశాల ఆవరణలో ఆధ్యాత్మిక, పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం సంప్రదాయబద్ధంగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టికొట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కేరింతలు, కృష్ణనామస్మరణతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. జన్మాష్టమి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి, శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధించిన ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను చిన్నారులకు తెలియజేశారు. పండుగలను పాఠశాల స్థాయిలో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన పెంపొందుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. చదువుతో పాటు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా వారిలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, కళా ప్రతిభ వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని కృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేశారు. చిన్నారుల అందమైన వేషధారణలు, నృత్యాలు, ఉట్టికొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



## వాంగ్దల్-గైరాన్ తండా రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

• రూ.1.90 కోట్లతో రహదారి నిర్మాణం • నాణ్యతలో రాజీ వద్దని అధికారులకు ఆదేశం







నారాయణఖేడ్, సెప్టెంబర్ 3, ప్రజాజ్యోతి: వాంగ్దల్--గైరాన్ తండా రహదారి నిర్మాణ పనులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గురువారం పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, ఎక్కడా రాజీ పడకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశాబ్దాలుగా సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న వాంగ్దల్--గైరాన్ తండా ప్రజల సమస్యను పరిష్కరించేందుకు రూ.1.90 కోట్ల నిధులతో రహదారి నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. రహదారి పూర్తయితే తండావాసుల రవాణా కష్టాలు తొలగిపోతాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మారుమూల తండాలు, గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా రహదారి కోసం ఎదురుచూస్తున్న గైరాన్ తండాకు శాశ్వత రహదారి సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. తండాల సమగ్ర అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి మౌలిక వసతులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. రహదారి నిర్మాణంతో తమ సమస్య పరిష్కారం కానుండటంతో గైరాన్ తండా ప్రజలు ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ఘనస్వాగతం పలికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు, తండావాసులు పాల్గొన్నారు.


## కంగ్టిలో మైనారిటీ ఫంక్షన్ హాల్‌కు భూమిపూజ

• ఎస్‌డీఎఫ్ నిధులతో అత్యాధునిక ఫంక్షన్ హాల్ నిర్మాణం

• ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



నారాయణఖేడ్, సెప్టెంబర్ 3, ప్రజాజ్యోతి: కంగ్టి మండల కేంద్రంలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ నిధులతో మంజూరైన అత్యాధునిక మైనారిటీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు గురువారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి మైనారిటీ కుటుంబాలు తమ శుభకార్యాలు తక్కువ ఖర్చుతో గౌరవప్రదంగా నిర్వహించుకునేలా ఫంక్షన్ హాల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, మైనారిటీలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి నాయకులు, మైనారిటీ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నర్సాపూర్‌లో కాళేశ్వరం కాల్వను సందర్శించినా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు: ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



నర్సాపూర్ 3సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) నర్సాపూర్ మండల్ రెడ్డిపల్లి గ్రామం లో కాళేశ్వరం కాలువను గురువారం నాడు సందర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వంలో కాళేశ్వరం కాలువ పనులు శరవేగంగా జరిగాయని కానీ 20 శాతం మిగిలి ఉన్న కాళేశ్వరం కాలువ పనులను పూర్తి చేయకుండా ఈ కాంగ్రెస్ రేవంత్ ప్రభుత్వం రైతులను దగా చేస్తుందని విమర్శించారు.కాళేశ్వరం కాలువ పనులను పూర్తి చేయడం ద్వారా నర్సాపూర్ నియోజకవర్గం ఆందోల్ నియోజకవర్గం లో లక్ష ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని అన్నారు.అదే కెసిఆర్ ప్రభుత్వంలో ఇదే ప్రాంతంలో హల్దీపై ఎండాకాలంలో మత్తడ్లు దుంకేటట్లు చేసి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించారన్నారు. కానీ ఇప్పుడు అదే హల్దీ వాగు వర్షాకాలంలో ఎండి పోయిందన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో మంజీరా పైన హల్దీ పైన పదుల సంఖ్యలో చెక్ డ్యాములు నిర్మించి రైతు బాంధవుడు అని నిరూపించుకున్నాడు మల్లన్న సాగర్ నుంచి నర్సాపూర్ వైపు వచ్చే కాళేశ్వరం కాలువ టనల్ 18 కిలోమీటర్ల లో 85% 15 నుంచి 16 కిలోమీటర్లు పూర్తయిందన్నారు.ఒక రెండు మూడు కిలోమీటర్లు పనులు పూర్తి చేస్తే రైతులకు నీరు అందుతుందన్నారు.హల్దీ నుంచి ఈ ప్రాంతం గుండా నిజాంసాగర్ వరకు ఆయకట్టు రైతులకు కూడా సాగునీరు వెళ్తుందన్నారు.ఈసందర్భన కార్యక్రమంలో తెలంగాణ కార్మిక విభాగం చైర్మన్ ఉమనగారి దేవేందర్ రెడ్డి మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్ నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్ గౌడ్ ఇతర గ్రామాల ఎంపిటిసిలు సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విషపూరితమైన సింథటిక్ కలర్‌తో కూడిన తీపి పీచు మిఠాయి

• దర్జాగా జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో అమ్ముతున్నారు పట్టించుకునే నాధుడే లేదు

• జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాములు నేత




జహీరాబాద్, సెప్టెంబర్ 03 ( ప్రజా జ్యోతి న్యూస్ ) ఉత్తరప్రదేశ్ కు చెందిన కొంతమంది యువకులు భయంకరమైనటువంటి సింథటిక్ కలర్స్ ను వినియోగించి పీచు మిఠాయిని తయారుచేసి జహీరాబాద్ పట్టణంలో వీధులలో తిరిగాడుతూ అమ్ముతున్నారు. వీరు ప్రజలు గుమ్మి గుడిన చోట ప్రభుత్వ ఆసుపత్రులలో బస్టాండ్లలో తిరుగాడుతూ అమ్ముతున్నారు. ఒకవేళ ఈ పీచు మిఠాయి తింటే చిన్నపిల్లకు అనేక రకాల భయంకర మైన వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నా యని వివిధ రాష్ట్రాలలో వీటి అమ్మకాలను నిలిపి వేసినారు. అక్కడి ప్రభుత్వాలు అయి నప్పటికిని మన జహీరాబాద్ ప్రాంతంలో ఎలాంటి భయం లేకుండా ఇలాంటి తినిబండ రాలను అమ్ముతుంటే పట్టించుకునే నాథుడే లేదు ఆహార భద్రత అధికారులు చూసిచూడ నట్లు వ్యవహరించడంతో ఇలాంటి తినిబండరాలు అనేక రూపాలలో జహీరాబాద్ ప్రాంతంలో అమ్ముతున్నారు. చౌకగా వచ్చే రంగులతో ఇలాంటి వస్తువులు తయారుచేసి అమ్మడం తో ప్రజలకు అనేక రకాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున ఇలాంటి వ్యక్తులు ఎక్కడైనా కనిపించినా పోలీసు అధికారులకు గానీ మున్సిపల్ సిబ్బందికి గాని లేదా ఆర భద్రత అధికారు లకు గాని ఫిర్యాదు చేసి ఇలాంటి వస్తువులను అమ్మే వాళ్లను అమ్మ కుండా అడ్డుకొని ప్రజల ఆరోగ్యా లను కాపాడ దానికి ప్రతి ఒక్కరూ ముందుకురావా లని జాగో తెలంగాణ తరఫునుండి పిలుపు నిస్తున్నాను.

## భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా సిద్దురావణ్ నియామకం



జహీరాబాద్, సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి న్యూస్) భీమ్ ఆర్మీ చీఫ్ ఆజాద్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ ఆజాద్ రావణ్ మరియు జాతీయ అధ్యక్షులు వినయ్ రతన్ సింగ్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించి నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ జ్యోతి రావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కాన్షిరామ్ గారి జీవిత విధానమే ఎందరో మహాపురుషుల ఆశయా సాధన కోసం పోరాడే భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) అడుగులు వేస్తుందని సిద్దు రావణ్ అన్నారు. బహుజన రాజ్యాధి కారమే లక్ష్యంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గడ్డ బహుజనుల అడ్డాగా మారుస్తానని రానున్న కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని నీలి జెండా రాష్ట్రంగా మారుస్తానని ఈ అడుగు తెలంగాణ చరిత్రలో ఒక మహా మైలురాయి కాబోతుందని పెద్దలు నన్ను నమ్మి నాకిచ్చిన ఇంత పెద్ద బాధ్యతను నమ్మకంగా నిలబెడతానని సిద్దు రావణ్ తెలియజేశారు.

## శుభకార్యంలో పేద కుటుంబానికి
# మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ ఆర్థికసాయం



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 03:** చేగుంట మండలంలోని చందాయిపేట గ్రామానికి చెందిన జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాల స్కావెంజర్ భీమని లక్ష్మి కుటుంబానికి గ్రామ మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ అండగా నిలిచారు. లక్ష్మి కుమార్తె తేజ వివాహం నిశ్చయం కావడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న వారు, వివాహ ఖర్చుల నిమిత్తం రూ.5 వేల నగదు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా స్వర్ణలత భాగ్యరాజ్ మాట్లాడుతూ, గ్రామంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా తనవంతు సహకారం అందించేందుకు ఎప్పుడూ ముందుంటానని తెలిపారు. గ్రామ ప్రజల సుఖదుఃఖాల్లో భాగస్వామిగా ఉంటూ, తనకు చేతనైన సహాయం అందించడం బాధ్యతగా భావిస్తున్నానన్నారు. తేజ వివాహం సంతోషంగా జరగాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎర్ర బాలమల్లు, మాజీ కో-ఆప్షన్ సభ్యురాలు లావణ్య, ఎర్ర దుర్గయ్య, కుంటెల్లి నరసింహులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 24 గంటల్లో పోగొట్టుకున్న మొబైల్ రికవరీ

◆ సీఈఐఆర్ సాంకేతికతతో గుర్తించిన జగదేవ్‌పూర్ పోలీసులు



**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 2 (ప్రజాజ్యోతి):** ప్రజలకు మెరుగైన సేవలందించడంలో జగదేవ్‌పూర్ పోలీసులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే సీఈఐఆర్ సాంకేతికతను ఉపయోగించి గుర్తించి బాధితుడికి అప్పగించారు. మునిగడప గ్రామానికి చెందిన చల్లా బాలకృష్ణ సెప్టెంబర్ 1న తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కానిస్టేబుల్ నాగరాజు సీఈఐఆర్ సాంకేతికతను వినియోగించి మొబైల్ ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్ఐ జె. కృష్ణారెడ్డి సమక్షంలో మొబైల్ ఫోన్‌ను బాలకృష్ణకు అప్పగించారు. తక్కువ సమయంలోనే మొబైల్‌ను రికవరీ చేసిన కానిస్టేబుల్ నాగరాజును ఎస్ఐ కృష్ణారెడ్డి అభినందించారు. పోలీసుల సేవలను ప్రశంసించిన బాలకృష్ణ, కానిస్టేబుల్ నాగరాజును శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎవరైనా మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సీఈఐఆర్ పోర్టల్‌లో మొబైల్ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సీఈఐఆర్ సాంకేతికత ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల భద్రత, ఆస్తుల పరిరక్షణకు జగదేవ్‌పూర్ పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

# వాలీబాల్‌లో బందారం బాలికల సత్తా

◆ సీనియర్ జూనియర్ విభాగాల్లో ప్రథమ బహుమతి



**కొండపాక సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి ):-** కొండపాక మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో బందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రాూ) విద్యార్థినులు సత్తా చాటారు. సీనియర్ బాలికల విభాగంతో పాటు జూనియర్ బాలికల విభాగంలోనూ ప్రథమ బహుమతి సాధించి ద్విగుణ విజయాన్ని నమోదు చేశారు. బందారం పాఠశాల విద్యార్థినులు క్రీడల్లోనూ తమ ప్రతిభను నిరూపిస్తూ వరుస విజయాలు సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారిణుల పట్టుదల, క్రమశిక్షణ, జట్టు సమన్వయంతో ఈ విజయం సాధ్యమైందని ఉపాధ్యాయులు తెలిపారు. మరోసారి బందారం పేరు నిలబెట్టిన బాలికలు అంటూ గ్రామస్థులు విద్యార్థినులను అభినందించారు.

## సింగాటం ప్రాథమిక
# పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**గజ్వేల్, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి):** గజ్వేల్ మండలంలోని సింగాటం ప్రాథమిక పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాఠశాలకు హాజరై సందడి చేశారు. చిన్నారుల వేషధారణలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులకు పండుగలు, సంప్రదాయాల ప్రాధాన్యతను తెలియజేయడం ద్వారా వారిలో సంస్కృతి పట్ల గౌరవం, మంచి విలువలు పెంపొందుతాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయన్నారు .అనంతరం శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో వచ్చిన చిన్నారులతో పాఠశాల ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఆటపాటల్లో పాల్గొంటూ, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తూ ఆనందోత్సాహాలతో కృష్ణాష్టమి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో చదువుకోవడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుకునూరి శేఖర్, యశోద కృష్ణ, రవీణతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రాధాగోపాలం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

◆ వేషధారణతో అలరించిన విద్యార్థులు



**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి)** స్థానిక సిద్ధార్థ కాన్సెప్ట్ స్కూల్‌లో ఈ రోజు ముందస్తు గా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో పిల్లలు విద్యార్థులు అంతా కూడా శ్రీకృష్ణుడి వేషధారణ లో అందరినీ అలరించారు. ఈ సందర్భంగా





సిద్దిపేట జిల్లా ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్ కె .రవీందర్ మాట్లాడుతూ.... విద్యార్థులు విద్య లోనే కాదు అన్ని రంగాల్లో ముందు ఉండాలి అని, ఇలాంటి కార్యక్రమాల లో విద్యార్థులు పాల్గొనడం వల్ల వారికి మానసిక ఉల్లాసం పొందుతారు తద్వారా విద్యార్థులల్లో ఏకాగ్రత మరియు పట్టుదల పెరుగుతుంది, దీని ద్వారా పిల్లల్లో మంచి ప్రవర్తన మరియు సమాజం గురించి కూడా అర్థం చేసుకొని జీవితం లో మంచి ఉన్నత స్థాయి లో ఉండే విధంగా విద్యార్థులు తమ జ్ఞానం పెంపొందించేందుకు కృషి జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు స్రవంతి, స్వప్న, మనిష, స్వప్న, మమత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు కృషి ఫలితం

◆ మెదక్ నర్సింగ్ కాలేజీకి రెండు ఆధునిక బస్సుల మంజూరు

◆ ఆరోగ్య రంగంలో మెదక్‌ను ఎవరికీ తీసిపోకుండా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే రోహిత్ రావు

◆ సచివాలయంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో ప్రత్యేక సమావేశం

◆ మెదక్ నర్సింగ్ కాలేజీ అభివృద్ధికి మరిన్ని చర్యలు.. త్వరలో క్రిటికల్ కేర్ సెంటర్ ప్రారంభానికి సన్నాహాలు





**మెదక్ (ప్రజాజ్యోతి)** మెదక్ నియోజకవర్గ ఆరోగ్య రంగం మరియు వైద్య విద్య అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక చొరవతో మెదక్ నర్సింగ్ కాలేజీకి రెండు ఆధునిక బస్సులు మంజూరయ్యాయి. నర్సింగ్ కాలేజీ విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంతో పాటు కళాశాలలో విద్యా, ప్రాక్టికల్ శిక్షణకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. మెదక్ నియోజకవర్గాన్ని ఆరోగ్య రంగంలో అన్ని విధాలుగా



అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఈరోజు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు రాష్ట్ర ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో మెదక్ ప్రాంతంలోని ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా మెదక్ నర్సింగ్ కాలేజీ అభివృద్ధి, అవసరమైన మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, వైద్య సేవల బలోపేతం, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగినట్లు సమాచారం. మెదక్‌లో ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమన్వయం చేస్తూ అవసరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వైద్య విద్యకు సంబంధించిన సంస్థలను కూడా బలోపేతం చేయాలనే దిశగా ఆయన కృషి కొనసాగుతోంది. మెదక్ నర్సింగ్ కాలేజీకి రెండు ఆధునిక బస్సుల మంజూరు ఈ ప్రయత్నాల్లో ఒక ముఖ్యమైన ఫలితంగా నిలిచింది. బస్సుల అందుబాటుతో విద్యార్థుల రవాణా సమస్యలు తగ్గడంతో పాటు కాలేజీకి సంబంధించిన విద్యా, ప్రాక్టికల్ కార్యకలాపాలకు మరింత సౌకర్యం కలగనుంది. అదేవిధంగా మెదక్ నర్సింగ్ కాలేజీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలను కొనసాగించనున్నట్లు సమావేశంలో చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా మౌలిక వసతులను బలోపేతం చేయడం, అవసరమైన సౌకర్యాలను కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మరోవైపు మెదక్ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న క్రిటికల్ కేర్ సెంటర్ ప్రారంభంపై కూడా దృష్టి సారించారు. క్రిటికల్ కేర్ సెంటర్‌ను త్వరలో ప్రారంభించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని సమావేశంలో వెల్లడైంది. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే అత్యవసర మరియు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న రోగులకు మరింత మెరుగైన





వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. మెదక్ నియోజకవర్గాన్ని ఆరోగ్య రంగంలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఏమాత్రం తీసిపోని విధంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వంతో, ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ మరిన్ని అభివృద్ధి చర్యలను ముందుకు తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు రాష్ట్ర ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మాందాపూర్ ప్రాథమిక
# పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**జగదేవ్‌పూర్ సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని మాందాపూర్ ప్రాథమిక పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం చిన్నారుల కృష్ణలీలలతో సందడిగా మారింది. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై, చక్కటి నృత్యాలతో అందరినీ అలరించారు. అనంతరం విద్యార్థులంతా ఉత్సాహంగా ఉట్టి కొట్టి కృష్ణాష్టమి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. శ్రీకృష్ణాష్టమి అనేది జగద్గురువు శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే పవిత్రమైన పర్వదినం. ధర్మం క్షీణించి, అధర్మం పెరిగినప్పుడు ధర్మాన్ని స్థాపించేందుకు శ్రీకృష్ణుడు అవతరించాడని పురాణాలు చెబుతున్నాయి. బాల్యంలో శ్రీకృష్ణుడు చేసిన అల్లరి, వెన్నదొంగతనం, గోపికలతో చేసిన బాల్యలీలలు నేటికీ అందరినీ ఆకట్టుకుంటాయి. శ్రీకృష్ణుడి జీవితం ప్రేమ, స్నేహం, ధైర్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠ వంటి ఎన్నో విలువలను మనకు బోధిస్తుంది. అందుకే కృష్ణాష్టమి చిన్నారులకు ఆధ్యాత్మికతతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించే విశిష్టమైన పండుగగా నిలుస్తుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి మాట్లాడుతూ, శ్రీకృష్ణుడి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన బోధించిన ధర్మమార్గాన్ని విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని పండుగ విశిష్టతను చాటిచెప్పడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్, అనిత పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## ఆర్యవైశ్య యువత సేవా
# కార్యక్రమాల్లో ముందుండాలి

◆ తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు శిరుప అనిల్



**కొమురవెల్లి, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):-** ఆర్యవైశ్య యువత సేవా కార్యక్రమాల్లో ముందుండి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు శిరుప అనిల్, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం కొమురవెల్లి మండలకేంద్రంలోని శ్రీ వాసవి నిత్య అన్నదాన సత్రంలో తెలంగాణ రాష్ట్ర, జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం కార్యవర్గ సమావేశం సిద్దిపేట జిల్లా యువజన విభాగం అధ్యక్షులు మంకాల నాగేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆర్యవైశ్య సమాజానికి చెందిన పేదలు, నిరుద్యోగులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు యువతను సేవా కార్యక్రమాల వైపు నడిపించడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పేద కుటుంబాలు, నిరుద్యోగ యువతకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ఒక కుటుంబం ఇబ్బందుల్లో ఉంటే మరో కుటుంబం అండగా నిలవాలని, ఒక యువకుడు ఉద్యోగం కోసం ఎదురుచూస్తుంటే అతనికి అవకాశాన్ని చూపించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సేవ అనేది కేవలం కార్యక్రమాల నిర్వహణకే పరిమితం కాకుండా ప్రతి ఆర్యవైశ్య కుటుంబానికి ప్రయోజనం చేకూర్చే ఉద్యమంగా మారాలని సూచించారు. విద్య, ఉపాధి, వ్యాపారం, వైద్యం, దానధర్మాలు, అన్నదానం తదితర రంగాల్లో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పూర్వీకులు చూపిన సేవా మార్గాన్ని నేటి యువత మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

**నాయకులకు ఘన సన్మానం**

అనంతరం సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో వివిధ బాధ్యతలు చేపట్టిన ఆర్యవైశ్య నాయకులు, సిద్దిపేట జిల్లా యువజన విభాగం ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఉప్పల చంద్రశేఖర్, రాష్ట్ర కోశాధికారి సోమిశెట్టి పవన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గౌరిశెట్టి శ్రీధర్, అదనపు ప్రధాన కార్యదర్శి మైలారపు రాంబాబు, మహాసభ జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులు, జిల్లా యూత్ కోశాధికారి చిట్టా నాగరాజు, జిల్లా యూత్ అదనపు ప్రధాన కార్యదర్శి తేరాల మారుతి, జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అరవపల్లి హరికిరణ్, సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రెటరీ సముద్రాల హరినాథ్, కోశాధికారి మంకాల నవీన్ కుమార్, మండల యూత్ అధ్యక్షులు అంబడిపల్లి ఈశ్వర్‌తో పాటు సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం సభ్యులు పాల్గొన్నారు.

## ఏటిగడ్డ కిష్టాపూర్ హనుమాన్
# జాతరకు బస్సులు ఏర్పాటు చేయాలి



**గజ్వేల్ సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి):** గజ్వేల్ పట్టణం ఆర్ అండ్ ఆర్ కాలనీ నుండి ఎటిగడ్డ కిష్టాపూర్ ముంపు గ్రామం వాగు వరకు సోమవారం రోజున హనుమాన్ జాతరకు బస్సులను ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ గజ్వేల్ మండలం కమిటీ ఆధ్వర్యంలో ఏటిగడ్డ కృష్ణాపూర్ హనుమాన్ జాతరకు బస్సులను ఏర్పాటు చేయాలని కోరుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో లో వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో ఈ నెల 7 తేదీన ఎడిగడ్డ కిష్టాపూర్ పరిధిలో ఉన్న హనుమాన్ జాతరకు ఉమ్మడి మెదక్ జిల్లా, కరీంనగర్ భువనగిరి ప్రాంతాల నుండి వేలాదిమంది ప్రజలు వస్తారని అన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు హనుమాన్ దేవాలయం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమని ముంపు గ్రామాల ప్రజలందరూ ప్రత్యేకంగా పండుగను జరుపుకుంటారని జాతరలో భాగస్వామ్యం అవుతారని అన్నారు. ముంపు గ్రామాల ప్రజలు గజ్వేల్ పట్టణంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఉండడంతో జాతర సందర్శించే విధంగా ప్రభుత్వం జోక్యం చేసుకొని భక్తుల సౌకర్యార్థం ఆర్ అండ్ ఆర్ కాలనీ సంగపూర్ నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు బండ్ల స్వామి, చంద్రం ప్రవీణ్ లక్ష్మణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

◆ రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన అనిల్‌రెడ్డి



**గజ్వేల్, సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి):** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.60 వేల ఆర్థిక సాయాన్ని సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి గురువారం అందజేశారు. వర్గల్ మండలం మాదారం గ్రామానికి చెందిన ఎల్క మల్లేశం గత ఆరు నెలల క్రితం అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్సకు అయిన ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం రూ.60 వేల ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు మంజూరైన చెక్కును అనిల్‌రెడ్డి మల్లేశం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్గల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్ట సాయికుమార్, కాంగ్రెస్ నాయకులు నందకుమార్, రాజు, నితిన్‌రెడ్డి, నర్సింలు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో కొర్విచెడ్‌ను ముందుంచుతా

- వాడవాడలా వాటర్ ట్యాంకుల నిర్మాణం
- గ్రామ పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం
- సమస్యల పరిష్కారమే లక్ష్యం:
- యువ నాయకుడు సర్పంచ్ పోలీస్ నవీన్ రెడ్డి





**బషీరాబాద్, సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి):** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కొర్విచెడ్ గ్రామాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ యువ నాయకుడు పోలీస్ నవీన్ రెడ్డి అన్నారు. గ్రామంలోని ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. చర్చి వెనకాల నుండి జెసిబి తో మురుగు కాలువను శుభ్రం చేయడం జరిగిందని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా వాడవాడలా వాటర్ ట్యాంకుల నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని నవీన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కొర్విచెడ్‌ను పరిశుభ్రత, మౌలిక వసతుల పరంగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**అధికారులతో సమన్వయం చేసి మౌలిక వసతుల సమస్యలను పరిష్కరిస్తాం: ముద్దం నర్సింహ యాదవ్**




**బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి) :** ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. డివిజన్‌లోని మల బస్తీలో నిర్మాణంలో ఉన్న పాండు రంగ భజన మండలి భవనాన్ని ఆయన సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి భవన నిర్మాణానికి సంబంధించిన అవసరాలను తెలుసుకున్నారు. అనంతరం శ్రీ సాయి ఎన్‌క్లేవ్‌లో కాలనీవాసులతో కలిసి పర్యటించిన ఆయన, విద్యుత్ స్తంభాల మరమ్మతులు, రోడ్లకు సంబంధించిన సమస్యలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, స్థానిక సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించడం తన నిరంతర కర్తవ్యమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సిద్దిరాం రెడ్డి, సెక్రటరీ మధుకర్ రెడ్డి, రాజులు, హరి, మధుసూదన్ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి, అశోక్ యాదవ్, సత్యనారాయణ, సూర్య భాను, చంటి తదితరులు పాల్గొన్నారు.

# రైతులను నమ్మించి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది

- హామీలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- గిట్టుబాటు ధర లేక రైతన్న కన్నీరే
- కాంగ్రెస్ నమ్మి మరోసారి మోసపోవద్దు
- బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి
- వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆద్వర్యంలో నర్కుడలో నిరసన




**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి) :** రైతులను నమ్మించి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ డిసిసిబి డైరెక్టర్ బుర్కుంట సతీష్ ఆధ్వర్యంలో గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కుడలో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన నిరసన దీక్షకు బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జి కార్తీక్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్ఎస్ నాయకులు వివరించారు. వరంగల్ డిక్లరేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. రైతులకు రైతు భరోసా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రూ. 2 లక్షల రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. రూ. 50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి ఆ హామీని కూడా నీరుగార్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అందిన రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం రైతులకు కనీసం పది గంటల పాటు కూడా నిరంతర విద్యుత్ అందని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని బోగస్‌గా మార్చిందని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. మద్దతు ధర కోసం రైతులు ఎదురుచూస్తుంటే, పంటల కొనుగోలు కేంద్రాల విషయంలో కూడా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. వర్షాలు, తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు సకాలంలో పంటల బీమా పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదని.. హామీలు మాత్రం కొండంత, అమలు మాత్రం శూన్యమని విమర్శించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఎప్పటికీ రాజీపడదని, అన్నదాతలకు అండగా నిలిచి వారి హక్కుల కోసం ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రైతు ప్రయోజనాలను తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నమ్మి మరోసారి ప్రజలు మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజశేఖర్ గౌడ్, జయసింహ, కొనమొల శ్రీనివాస్, గౌస్ పాషా, చెక్కల చంద్రశేఖర్, వీరాచారి, ప్రసాద్ గౌడ్, బుర్కుకుంట మహేష్, కొమ్ము గోపాల్, వెంకట్ రెడ్డి, కృష్ణ, మహేష్, ఆంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### పి.ఆర్.టి.యు పరిగి మండల

# నూతన అధ్యక్షుడిగా మంచనపల్లి శ్రీనివాస్




- ప్రధాన కార్యదర్శిగా డి. మనోహర్ ఎన్నిక
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తుంది: జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్

**పరిగి, సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** వికారాబాద్ జిల్లా పరిగి పి.ఆర్.టి.యు (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) మండల శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం పరిగిలోని శ్రీ లక్ష్మీ బ్యాంకెట్ హాల్‌లో ఘనంగా ఎన్నుకున్నారు. 2026--2028 విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఈ ఎన్నికలు మండల శాఖ అధ్యక్షుడు బుగ్గయ్య, ప్రధాన కార్యదర్శి వార్ల రాకేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి పి.ఆర్.టి.యు జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోమ అమర్‌నాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి వార్ల రాకేష్ గత రెండేళ్ల కాలానికి సంబంధించిన కార్యదర్శి నివేదికను సమర్పించగా, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులతో పాటు ప్రాథమిక సభ్యులు చప్పట్లతో ఆమోదించారు.

అనంతరం నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా మంచనపల్లి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా ఎం.డి. ఉస్మాన్ అలీ, ప్రధాన కార్యదర్శిగా డి. మనోహర్ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా సుధాకర్, తస్లీమా, సంధ్యారాణి, ఉపాధ్యక్షులుగా మహేందర్, రాకేష్, కార్యదర్శులుగా రమేష్, మహేందర్ తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పి.ఆర్.టి.యు నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా సీపీఎస్ రద్దు, పీఆర్సీ అమలు, హెల్త్ కార్డుల జారీ వంటి అంశాల్లో ఆలస్యం చేయరాదని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిగిలి శ్రీపాల్ రెడ్డి సూచించినట్లుగా ప్రభుత్వం వెంటనే పీఆర్సీని అమలు చేయాలని కోరారు.

నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ రాష్ట్ర, జిల్లా కమిటీల ఆదేశాలను పాటిస్తూ సంఘ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పరిగి మండల విద్యాధికారి అంజయ్య, బొంరాస్‌పేట్ మండల విద్యాధికారి, జీహెచ్‌ఎం జిల్లా అధ్యక్షుడు హరిలాల్, జీహెచ్‌ఎంలు శుభాన్, వెంకటేశం, లాల్యా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామాంజనేయులు, వెంకటయ్య, గోపాల్, రాష్ట్ర కార్యదర్శులు బాల్‌రాజు, ప్రకాష్, రాజశేఖర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, జిల్లా నాయకులు ఆదిశంకర్, తావుర్య, రాజేష్ రాథోడ్, ఇబ్రహీం, ప్రభాకర్ రెడ్డి, సాయిలు, జైపాల్ రెడ్డి, శ్రీకాంత్, శీనయ్య, భీమయ్య, నర్సిములు, శ్రీనివాస్, మండల అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పూడూర్, దోమ, కుల్కచెర్ల, బొంరాస్‌పేట్, వికారాబాద్ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, సంఘభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కుల్కచర్లలో రైతు గర్జన..

### కాంగ్రెస్ విధానాలపై బీఆర్ఎస్ ధ్వజం






- రైతుబంధు, రైతు బీమా పథకాలపై కాంగ్రెస్‌ను ప్రశ్నించిన మహేష్ రెడ్డి

**పరిగి/కుల్కచర్ల, సెప్టెంబర్ 03 :** రైతు ఏడ్చినా ఏ రాజ్యం బాగుపడిన చరిత్ర లేదని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ గురువారం కుల్కచర్ల పట్టణ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సు, ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు రైతులకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వాటిని అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారని, అయితే ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు గడిచినా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్ పాలనపై నిరసనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూరియా ఎరువుల కోసం రైతులు అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని, కొన్ని చోట్ల పోలీసుల కాళ్లు పట్టుకునే పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పంటలకు బోనస్ లేదని, గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కౌలు రైతులకు పెట్టుబడి సాయం లేదని, రెండు లక్షల రూపాయల రుణమాఫీ అమలు కాలేదని, పండించిన పంటలను ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయడం లేదని విమర్శించారు.

రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్ రెడ్డి, సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ కో ఆప్షన్ సభ్యులు మీర్ మహేమూద్ అలీ, కుల్కచర్ల మండల బీఆర్ఎస్ నాయకులు, పరిగి మున్సిపల్ కౌన్సిలర్ మీర్ తాహేర్ అలీ, ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# పదేళ్ల కాలంలో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాం




- రైతులకు రూ. 500 బోనస్, రెట్టింపు పెన్షన్ల ఊసే లేదు!
- రాష్ట్ర విముక్తి కోసం మరోసారి ఉద్యమం తప్పదు!
- ప్రశ్నిస్తే కేసులు పెడతారా.. జైల్‌భరోకు సిద్ధం
- భూమిలేని పేదలకు ఏడాదికి రూ. 12 వేల సాయం ఎక్కడ?
- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఘాటు విమర్శలు

**తాండూరు, సెప్టెంబర్ 3, ప్రజా జ్యోతి :** తెలంగాణలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్న 10 ఏళ్ల కాలంలో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి చెప్పారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గౌతాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

గత ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వస్తే వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని రైతులకు చెప్పిన హామీ ఎందుకు అమలు చేయడం లేదని విమర్శించారు. అదేవిధంగా వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు ఉన్న పెన్షన్లను రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీకి కూడా అతీగతీ లేదని ఆరోపించారు. అదేవిదంగా భూమిలేని పేదలకు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిపై కేసులు నమోదు చేయడం సరికాదని రోహిత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే ప్రజల కోసం మరోసారి ఉద్యమబాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అవసరమైతే జైల్‌భరో కార్యక్రమానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు.

రాష్ట్ర విముక్తి కోసం మరోసారి ఉద్యమం చేయాల్సిన పరిస్థితి వస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. రైతులు, పేదలు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ రైతు సదస్సులో స్థానిక నాయకులు, రాజప్ప గౌడ్, వీరేందర్ రెడ్డి, ఆర్ సి గౌడ్, ఉమా శంకర్, రాకేష్ గౌడ్, పలు గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆరెకటిక సంఘం అధ్యక్ష ఎన్నికల షెడ్యూల్ విడుదల




**హైదరాబాద్, సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ ఆరెకటిక ట్రస్ట్, తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక ఎన్నికల కమిటీ సంయుక్తంగా రాష్ట్ర ఆరెకటిక సంఘం అధ్యక్ష ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించినట్లు తెలంగాణ ఆరెకటిక ట్రస్ట్ ఉపాధ్యక్షుడు దబ్బికర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శి వి. మురళీధర్, కోశాధికారి యు. యశ్వంత్ రావు, ఎన్నికల కమిటీ అధ్యక్షుడు జమాల్‌పూర్ బాలరాజ్, కార్యదర్శి నిజాంకర్ చంద్రశేఖర్ లతోకలసి ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2న హైదరాబాద్‌లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 7 నుంచి నామినేషన్లు స్వీకరించనుండగా, సెప్టెంబర్ 12 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు, సెప్టెంబర్ 17న తుది అభ్యర్థుల జాబితా, ఎన్నికల గుర్తుల కేటాయింపునకు గడువు విధించినట్లు చెప్పారు. అధ్యక్షుడి పదవీకాలం నాలుగేళ్లు కాగా, అభ్యర్థి అధికారిక ఓటర్ల జాబితాలో నమోదై ఉండటంతో పాటు ఇద్దరు నమోదిత ఓటర్లు ప్రతిపాదించి, బలపరచాలని తెలిపారు. అదేవిధంగా నామినేషన్ రుసుము రూ. 11 వేలుగా కమిటీ ప్రకటించిందని తెలిపారు.

# పేటీఎంతో క్యారట్‌లేన్ భాగస్వామ్యం

**హైదరాబాద్, సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి) :** పేటీఎం (వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్) క్యారట్‌లేన్‌తో భాగస్వామ్యం ద్వారా తన ప్లాట్‌ఫామ్‌లో రింగ్స్, చెవిపోగులు, పెండెంట్లు, నెక్లెస్‌లు, గాజులు, బ్రేస్‌లెట్లు తదితర ఆభరణాలను అందుబాటులోకి తెచ్చిందని పేటీఎం వైస్ ప్రెసిడెంట్ వీర్ మిశ్రా గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యారట్‌లేన్ మేనేజింగ్ డైరెక్టర్ సౌమెన్ భౌమిక్ తోకలసి ఆయన మాట్లాడుతూ పేటీఎం డిజిటల్ గోల్డ్‌ను ఆభరణాల కొనుగోలుకు వినియోగించి, మిగిలిన మొత్తాన్ని యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ తదితర మార్గాల్లో చెల్లించవచ్చని తెలిపారు. డిజిటల్ గోల్డ్‌ను ఆభరణాల కొనుగోలుకు వినియోగించే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. డిజిటల్ గోల్డ్‌ను ఆభరణాలుగా మార్చుకునే అవకాశం వినియోగదారులకు లభిస్తోందన్నారు. క్యారట్‌లేన్ ప్యాకేజింగ్, ఆర్డర్ పూర్తి చేయడం, హోమ్ డెలివరీని నిర్వహించనుందని తెలిపారు.

# కొత్తూరులో గణేష్ ఆగ్మాన్

- యువజన యూత్ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఆగ్మాన్ శోభ యాత్ర
- ప్రతి ఒక్కరు పాల్గొని ఆగ్మాన్ శోభ యాత్రను విజయవంతం చేయాలి
- యువజన యూత్ సభ్యుల విజ్ఞప్తి




**కొత్తూరు సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి) :** కొత్తూరు మున్సిపాలిటీలో యువజన యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నేడు సాయంత్రం 6 గంటలకు పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఆగ్మాన్ శోభ యాత్ర ప్రారంభం కానున్నది. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, మీడియా సోదరులు, వివిధ యూత్ సభ్యులు, యువజన నాయకులు, వివిధ పార్టీల నాయకులు, అందరూ పాల్గొని శోభాయాత్ర విజయవంతం చేయవలసిందిగా యువజన యూత్ సభ్యులు కోరారు.

# ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలి

- యువ నాయకుడు ఎర్రవెల్లి శివకుమార్ చారి
- హనుమాన్ ఆలయానికి ఔజా కంపెనీ బాక్సులు అందజేత
- శివకుమార్ చారిని అభినందించిన ఆలయ అర్చకుడు నాగరాజ్ శర్మ



**కొత్తూరు సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి) :** ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని యువ నాయకుడు ఎర్రవెల్లి శివకుమార్ చారి అన్నారు. గురువారం కొత్తూరు మున్సిపాలిటీలోని మారుతి హనుమాన్ దేవాలయానికి సొంత నిధులతో యువ నాయకుడు ఎర్రవెల్లి శివకుమార్ చారి ఔజా కంపెనీ బాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ చారిని ఆలయ అర్చకుడు నాగరాజ్ శర్మ అభినందించారు.

# వర్షాకాలం చిరుతిళ్లతో దంత సమస్యలు

**ప్రముఖ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ సోనియా దత్తా**



**హైదరాబాద్, సెప్టెంబర్ 03 (ప్రజా జ్యోతి) :** వర్షాకాలపు రుచులను మితంగా ఆస్వాదిస్తూ నోటి పరిశుభ్రతను నిరంతరం పాటించాలని ప్రముఖ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ సోనియా దత్తా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాకాలంలో తరచూ చిరుతిళ్లు, చక్కెర-పిండి పదార్థాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల దంతాలపై పాచి పేరుకుపోవడం, క్యావిటీలు వచ్చే ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించారు. చిరుతిళ్లు తిన్న తర్వాత నీటితో నోరు పుక్కిలించడం, తగినంత నీరు తాగడం, రోజుకు రెండుసార్లు పళ్లు తోమడం ద్వారా నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. రోజువారీ దంత సంరక్షణలో లవంగం, శొంఠి వంటి ఆయుర్వేద మూలికలతో కూడిన, ఐడిఎ గుర్తింపు పొందిన డాబర్ రెడ్ టూత్‌పేస్ట్ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

# గౌతమ్ ఉన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

## కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి

## ఆటపాటలతో అలరించిన విద్యార్థులు.. ఉట్టికొట్టి సంబరాలు

కోరుట్ల, సెప్టెంబర్ 3 ప్రజాజ్యోతి: కోరుట్ల పట్టణంలోని గౌతమ్ ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని



కృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయ పద్ధతిలో కృష్ణాష్టమి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగురంగుల దుస్తులు ధరించి, కృష్ణుడి బాల్య లీలలను ప్రతిబింబించే విధంగా ఆటపాటలతో సందడి చేశారు. చిన్నారుల వేషధారణలు, వారి చక్కటి ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.

**– ఉట్టికొట్టి.. ఉత్సాహంగా సంబరాలు:**

కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఉట్టికొట్టి కృష్ణుని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి కృష్ణాష్టమి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

**– పండుగల ప్రాధాన్యతను పిల్లలకు వివరించిన కరస్పాండెంట్:**

ఈ సందర్భంగా గౌతమ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ యం.ఎ. గఫార్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో పాఠశాలలో వివిధ పండుగలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సాంప్రదాయాలకు అతీతంగా కృష్ణాష్టమి వేడుకలను అందరూ కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.శ్రీకృష్ణుని జన్మదినాన్ని కృష్ణాష్టమిగా ఎందుకు జరుపుకుంటారు, శ్రీకృష్ణుని జీవిత విశేషాలు, ఆయన బోధనలు, బాల్య లీలల గురించి విద్యార్థులకు వివరించారు. పండుగలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా వాటి వెనుక ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను పిల్లలు తెలుసుకోవాలని సూచించారు.కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు చేసిన ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పాఠశాల నిర్వాహకులు



పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ యం.ఎ. కిజర్, కరస్పాండెంట్ యం.ఎ. గఫార్, జాయింట్ సెక్రటరీ యం.ఎ. అఫ్రోజ్, ప్రిన్సిపాల్స్ గోపి మారాసి, క్రిస్టినా, ఇన్‌చార్జీలు శంకర్, అముతులీక్ వదూద్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పారమిత హెరిటేజ్ పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కరీంనగర్ టౌన్,సెప్టెంబర్ 3( ప్రజాజ్యోతి )

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను



గురువారం ఘనంగా నిర్వహించారు. ముందస్తు వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో హాజరై అలరించారు. దీంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.చిన్నారులు శ్రీకృష్ణుడి పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. జన్మాష్టమి సందర్భంగా నిర్వహించిన ఉట్టి పోటీల్లో చిన్నారి కృష్ణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు.

ఈ సందర్భంగా పారమిత పాఠశాలల చైర్మన్ డాక్టర్ ఈ. ప్రసాదరావు మాట్లాడుతూ, శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రతి ఒక్కరి జీవితంలో ఒత్తిళ్లు, చింతలను తొలగించి ప్రేమ, శాంతి, ఆనందాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. భగవద్గీత సందేశాన్ని అనుసరిస్తూ ఫలితాన్ని ఆశించకుండా ఏకాగ్రతతో, ఇష్టపూర్వకంగా కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సూచించారు. నేటి యువత శ్రీకృష్ణుడి బోధనలను దైనందిన జీవితంలో ఆచరిస్తూ విజయ పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.ఎం. ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు రబీంద్ర పాత్రో, భవాని, నిఖిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి పార్టీ నిర్మాణమే కాంగ్రెస్ విజయానికి కీలకం

**టీపీసీసీ ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ సేడ్మకి ఆనంద్ రావు**

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి ):

కాంగ్రెస్ పార్టీ విజయానికి గ్రామ, వార్డు, పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం





చేయడం కీలకమని టీపీసీసీ ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ సేడ్మకి ఆనంద్ రావు అన్నారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఏఐసీసీ పిలుపు మేరకు చేపడుతున్న 'సంఘటన్ సృజన్ అభియాన్' ద్వారా ప్రతి బూత్‌కు కమిటీలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయో పరిశీలించాలని సూచించారు. కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో ఆదివాసి కాంగ్రెస్ జిల్లా కమిటీల నిర్మాణానికి నాయకులు, కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ది ఛార్జ్‌షీట్ కాదు.. కేసీఆర్ అబద్ధాల షీట్

## వైద్యుల అంజన్‌కుమార్

కరీంనగర్ టౌన్,సెప్టెంబర్ 3( ప్రజాజ్యోతి ):

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్‌కుమార్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇందిరాభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్



విడుదల చేసిన ఛార్జ్‌షీట్ వాస్తవాల ఆధారంగా లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల అక్కసుకు నిదర్శనమని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో RGPRS జిల్లా చైర్మన్ మడుపు మోహన్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్, కంకణాల అనిల్, పహాడ్ ఇమ్రాన్ ఘని, శ్రీనివాస్, ఖదీర్, ప్రశాంత్ గౌడ్, పాండుర్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# విన్నర్స్ స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కొడిమ్యాల,సెప్టెంబర్ 3,(ప్రజాజ్యోతి):

మండల కేంద్రంలోని విన్నర్స్ ఇంగ్లీష్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలతో ఆకట్టుకున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై చిన్నారుల్లో అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం తెలిపింది.



# ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత

## మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 3( ప్రజాజ్యోతి ):

కరీంనగర్ నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.నగరంలోని 21వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న బాత్రూమ్ నిర్మాణ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. అనంతరం 44వ డివిజన్ శ్రీనగర్ కాలనీలోని సంతోషిమాత ఆలయం వద్ద చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

తదుపరి 62వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూనగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ తదితర సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు.ప్రజల సహకారంతో కరీంనగర్ నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని మేయర్ స్పష్టం చేశారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో



కార్పొరేటర్లు వరాల నర్సింగం, చాడగొండ కవిత బుచ్చిరెడ్డి, పెద్దపెల్లి శ్రీలేఖ జితేందర్, గాజా రామ శివరాం, కర్రె పద్మ అనిల్, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, బీజేపీ నాయకులు కొండపల్లి సతీష్, బండి ప్రమోద్, కపిల్, మహేష్, దీపు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఆయా డివిజన్ల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై వివక్ష చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల, సెప్టెంబర్ 3,(ప్రజాజ్యోతి):

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నిరసనలో ఆయన మాట్లాడారు. రైతులకు రూ.15 వేల రైతుభరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్..



వాటిని పూర్తిగా అమలు చేయలేదన్నారు. హామీలు నెరవేర్చకుండా ర్యాలీలు ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. మండలంలో పలువురు రైతులకు రుణమాఫీ పూర్తికాలేదని, ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్, సాగునీటితో రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. ప్రస్తుతం సాగునీరు, విద్యుత్ సమస్యలు నెలకొన్నాయని ఆరోపించారు. హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని రవిశంకర్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి వెంకటేష్,మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పుణుగోటి కృష్ణారావు,నాయకులు పిడుగు ప్రభాకర్ రెడ్డి,సురుగు శ్రీనివాస్,కొత్తూరి స్వామి,చంద్రమోహన్ రెడ్డి,పర్లపల్లి ప్రభుదాస్,రొడ్డ శరత్,చందు,సాగర్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష నేత కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్

**వేములవాడలో కాంగ్రెస్ భారీ నిరసన ర్యాలీ: 500 మీటర్ల ఫ్లెక్సీతో బీఆర్ఎస్ వైఫల్యాల ఎండగట్టిన నేత**

**అసెంబ్లీకి రాని కేసీఆర్ దేశంలోనే ఫెయిల్ అయిన ప్రతిపక్ష నేత: ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ధ్వజం**

**బీఆర్ఎస్ ది ఫామ్ హౌస్ పాలన.. కాంగ్రెస్‌ది ప్రజా పాలన: వేములవాడలో గులాబీ పార్టీపై తీవ్ర విమర్శలు**

వేములవాడ,సెప్టెంబర్,03:ప్రజాజ్యోతి.

వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో ప్రతిపక్ష నేత కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది



శ్రీనివాస్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు మరియు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సుమారు 500 మీటర్ల మేర ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కల్వకుంట్ల కుటుంబం గత పది సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి తీవ్రంగా దోచుకుందని, రాష్ట్ర ప్రజలకు ఆ కుటుంబం ఎంతగానో బాకీ ఉందని ఈ సందర్భంగా విమర్శించారు. బీఆర్ఎస్ పాలన ఫెయిల్ అయినట్లు స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ, బీఆర్ఎస్ ది ఫామ్ హౌస్ పాలన అయితే తమది ప్రజా పాలన అని స్పష్టం చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రజా సమస్యలపై మాట్లాడటంలో పూర్తిగా విఫలమైన కేసీఆర్ దేశంలోనే ఫెయిల్ అయిన ప్రతిపక్ష నేతగా మిగిలిపోయారని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి మరియు సీఎంకు వస్తున్న ప్రజా ఆదరణను చూసి ఓర్వలేక బావ బామ్మర్దులు భయపడుతున్నారని, బీఆర్ఎస్ నాయకులు ఈ అభివృద్ధిని చూసి తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు.

# చీర్లవంచ పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్

రాజన్న సిరిసిల్ల సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి)

వేములవాడ మండలం చీర్లవంచ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ అందరు ప్రోగ్రామ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ముఖ్యంగా అసాంక్రమిక వ్యాధుల నియంత్రణలో భాగంగా మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ తదితర వ్యాధులకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్, ముందస్తు గుర్తింపు, చికిత్స ఫాలోఅప్ వివరాలను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్ సి డి స్క్రీనింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ప్రస్తుత కాలానుగుణ వ్యాధులు అయిన డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్స్ తదితర వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించి, ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను లక్ష్యాల మేరకు సమర్థవంతంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేందర్ బాబు, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్ కుమార్,వైద్యాధికారి డాక్టర్ శరణ్య తదితరులు పాల్గొన్నారు.





# వాణీనికేతన్ హైస్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ఇల్లంతకుంట సెప్టెంబర్3(ప్రజా జ్యోతి)

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణినికేతన్ హై స్కూల్లో గురువారం రోజు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గోపికలుగా ముస్తాబయి వచ్చిన బాలికలు, చిన్నికృష్ణులుగా వేషధారణంలో వచ్చిన



బాలురు ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు. ఉత్తుకొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాలొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు బోధించిన సత్యం, ధర్మం, స్నేహం, ప్రేమల గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పండుగలు కేవలం ఆనందానికి మాత్రమే కాకుండా ఐక్యతను పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సంతోష్, తిరుపతి, రాజు, సుమంగళి, శోభ, మహాలక్ష్మి , సునంద, మౌనిక, కళ్యాణి, షమీమా, రేణుక, జలజ, శాంత, పద్మ, రేణుక, సునీత, స్వాతి, ఉష, లావణ్యలతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు

# మిడ్ మానేరు నుండి నీటిని విడుదల చేయాలని రైతుల రాస్తారోకో

ఇల్లంతకుంట సెప్టెంబర్3(ప్రజా జ్యోతి)

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల పరిధిలోగల మిడ్ మానేరు జలాశయం నుండి కుడి కాలువ ద్వారా సాగునీటి కోసం నీటిని వదలాలని డిమాండ్ చేస్తూ గురువారం రోజు ఇల్లంతకుంట -కరీంనగర్ వెళ్లే రహదారిలోని వంతడ్పుల బ్రీడ్జి పై రోడ్డు పై రైతులు బైటాయించి రాస్తారోకో



చేశారు. ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి వుంటే వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవ చూపి సాగునీరాందేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో వల్లంపట్ల, వంతడుపుల, కిష్టారావుపల్లే, గాలిపల్లి, తో పాటు పలు గ్రామాల రైతులున్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో కలుషిత ఆహారం తిని 5గురు విద్యార్థులకు అస్వస్థత

● తక్షణం సూపర్వైజర్ రజిని స్పందించడంతో చిన్నారులు ఆరోగ్యం క్షేమం

● ఘటన ఆలస్యంగా వెలుగులోకి





సత్తుపల్లి సెప్టెంబర్03(ప్రజా జ్యోతి) కలుషిత ఆహారం తిని, 5గురు చిన్నారులకు అస్వస్థతకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని కిష్టారం అంగన్వాడి సెంటర్..3 నందు చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం గత 5 రోజుల క్రితం అంగన్వాడి సెంటర్లో ఆహారం వండే సమయంలో, ఆకుకూరలతో పాటు పక్కన ఉన్న గన్నేరు ఆకులు వంటలో కలవడంతో, ఆ ఆహారాన్ని తిన్న5 చిన్నారులు అస్వస్థకు గురి అయినారు. ఆ సెంటర్ సూపర్వైజర్ రజిని,టీచర్ కృష్ణకుమారి గుట్టు చప్పుడు కాకుండా ఆసుపత్రి తరలించి వైద్యం అందించారు. ప్రస్తుత పరిస్థితి చిన్నారుల ఆరోగ్యం నిలకడగానే ఉంది. తక్షణం సూపర్వైజర్ స్పందించడం పట్ల చిన్నారులు క్షేమంగా ఉన్నారు. సెంటర్ పరిశుభ్రత చాలా ఘోరంగా ఉంది. పరిశుభ్రత ఉంచాలని, పిల్లల పట్ల శ్రద్ధగా ఉండాలని, గ్రామస్తులు,తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



బోనకల్, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి): స్థానిక షైన్ హై స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం చాలా ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు రాధా వస్త్రధారణలో అందరిని ఆకట్టుకున్నారు. తదుపరి ఉట్టి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఈ కార్యక్రమంలో చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ.. హిందూ ధర్మంలో శ్రీకృష్ణుడు శ్రీమహావిష్ణువు యొక్క ఎనిమిదవ అవతారంగా పూజలు అందుకుంటున్నాడని, ధర్మాన్ని రక్షించడానికి దుష్టశిక్షణ చేయడానికి తను ఎప్పుడూ ముందుంటానని, శ్రీకృష్ణుడు గీత ద్వారా చాటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా,డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్,ప్రిన్సిపల్ అయిటి పాముల శ్వేత, అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

● ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్



సత్తుపల్లి సెప్టెంబర్03(ప్రజా జ్యోతి) నేడు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని, సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శుక్రవారం సిద్ధారం రోడ్డు లో గల లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం 12:00 గంటలకు మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఉన్నారు. ఈ చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ విశిష్ట అతిథులుగా పాల్గొంటున్నారు కాబట్టి, నియోజకవర్గంలోని ప్రజలు, ప్రతినిధులు,కాంగ్రెస్ అభిమానులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శాసన సభ్యురాలు తెలియజేశారు.

## టీజెఎస్‌ను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు



నేలకొండపల్లి, సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి: తెలంగాణ జన సమితి ని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంచార్జీ గోపగాని శంకర్రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ సమావేశం ను మాదాసు శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పై ప్రభుత్వం కు వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం త్వరలోనే సానుకూలంగా ప్రకటన చేస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. టీజేఎస్ ను గ్రామ స్థాయి, మండల




స్థాయిశమిటీలు ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యల్ని పై క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం నేలకొండపల్లి మండల కమిటిని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు గా మందడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాక్షులు గా యర్రా వెంకటేశ్వర్లు, కార్లపాటి కోటయ్య, ప్రధాన కార్యదర్శి గా బీ.నాగేశ్వరరావు, కార్యదర్శి లు గా గుగులోత్ ఆంజనేయులు, చిట్టూరి వెంకయ్య, కోశాధికారి గా రెడ్డిబత్తుల సాంబిరెడ్డి, కార్యవర్గ సభ్యులు గా గుగులోత్ నాగేశ్వరరావు, వడ్లమూడి వెంకటరాములు, మోహన్రావు, గార్లపాటి సత్యనారాయణ, ధనమూర్తి, రంగయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు, కాకామాను మల్లిఖార్జున్రావు, తీగ రాములు, మేకల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసులో కాంట్రాక్టర్‌కు జైలు శిక్ష

● రూ.22 లక్షల అప్పు..3 చెక్కులు బౌన్స్..నిందితుడికి 6 నెలల జైలు

● భద్రాచలం జేఎఫ్ఎమ్సీ కోర్టు సంచలన తీర్పు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 03.(ప్రజాజ్యోతి) చెక్ బౌన్స్ కేసుల్లో భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (జేఎఫ్ఎమ్సీ) కోర్టు గురువారం సంచలన తీర్పు వెలువరించింది. 2019లో ఖమ్మంకు చెందిన కాంట్రాక్టర్ కిలారు శ్రీనివాసరావు లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి వద్ద వివిధ దఫాలుగా మొత్తం రూ.22 లక్షలు అప్పుగా తీసుకున్నారు.అయితే అప్పు తీర్చేందుకు ఇచ్చిన మూడు చెక్కులు ఓ బ్యాంకు లో బౌన్స్ కావడంతో బాధితుడు భద్రాచలం జేఎఫ్ఎమ్సీ కోర్టులో కేసులు దాఖలు చేశారు.ఈ కేసుల్లో సుదీర్ఘ వాదోపవాదాలు ముగిసిన అనంతరం కోర్టు న్యాయమూర్తి శివ నాయక్ తుది తీర్పును వెలువరించారు.నిందితుడు కిలారు శ్రీనివాసరావు నేరం చేసినట్లు రుజువుకావడంతో మూడు కేసుల్లోనూ ఒక్కో కేసుకు ఆరు నెలల చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.అంతేకాకుండా చెక్కుల మొత్తాన్ని బాధితుడికి చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ తీర్పు భద్రాచలంలో సంచలనంగా మారింది.

# హామీల కార్డు.. కాంగ్రెస్ బాకీ కార్డుగా మారింది!

● 420 హామీల్లో అమలెన్ని?.. రైతులను విస్మరించిన కాంగ్రెస్ సర్కారుపై కమల్‌రాజ్ ధ్వజం

● వంద రోజుల్లో హామీలన్నారు.. వెయ్యి రోజులు దాటినా ఆచరణ ఏదీ? ● భారీ ట్రాక్టర్ ర్యాలీతో బీఆర్ఎస్ రైతు నిరసన





ఎర్రుపాలెం ప్రజా జ్యోతి ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చాక రైతులు, యువత, మహిళలు, విద్యార్థులు, కార్మికులు, వృద్ధులు ఇలా అన్ని వర్గాలను విస్మరించిందని మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తీవ్రంగా విమర్శించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న రైతు నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఎర్రుపాలెం మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం మామునూరులో భారీ రైతు నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతులు పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో ర్యాలీగా తరలివచ్చి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడూరు రమణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కమల్‌రాజ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరు హామీల కార్డును ప్రజలకు అందించి, దానిని భద్రంగా దాచుకోవాలని చెప్పారని గుర్తుచేశారు. రూ.100 స్టాంప్ పేపర్‌పై హామీలు రాసి ఇస్తామని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. హామీలను అమలు చేయకపోవడంతో ఆ హామీ కార్డు ఇప్పుడు 'కాంగ్రెస్ బాకీ కార్డు'గా మారిందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ ఉందో బీఆర్ఎస్ శ్రేణులు ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రతి కాంగ్రెస్ నాయకుడిని హామీల అమలుపై నిలదీసి.. ప్రజలకు రావాల్సిన బాకీని అడిగి వసూలు చేసుకునేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.పుట్టిన బిడ్డకు అందాల్సిన కేసీఆర్ కిట్ నుంచి విద్యార్థులకు ఫీజు కార్డులు, యువతులకు స్కూటీలు, వివాహమైన మహిళలకు రూ.1.16 లక్షలకు అదనంగా తులం బంగారం, ఆసరా పింఛన్లను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీలు ఇచ్చిందని పేర్కొన్నారు. రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.15 వేలు, ఆటో కార్మికులకు రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను సైతం ప్రస్తుత ప్రభుత్వ అభివృద్ధిగా స్థానిక ఎమ్మెల్యే చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని కమల్‌రాజ్ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తయిన పనులకు ఇప్పుడు కొత్త రంగులు అద్దుతూ తమ ఖాతాలో వేసుకోవడం తప్ప.. కొత్తగా ప్రజలకు కనిపించే అభివృద్ధి ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు.పుట్టిన బిడ్డ నుంచి పండు వృద్ధుల వరకు.. విద్యార్థుల నుంచి రైతులు, రైతు కూలీలు, ఆటో కార్మికుల వరకు ప్రతి వర్గానికి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వాటి అమలును విస్మరించిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన ప్రభుత్వం.. హామీలను పక్కనపెట్టి కాలయాపన చేయడం దారుణమన్నారు.వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. నేటికి వెయ్యి రోజులు పూర్తయినా హామీల అమలు పూర్తిస్థాయిలో జరగలేదని విమర్శించారు. ఇన్ని రోజులు గడిచినా కొత్త మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. "ఇక ప్రజలను మోసం చేయడం సాధ్యం కాదు.. మీ పప్పులు ఉడకవు" అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి అండగా బీఆర్ఎస్ నిలుస్తుందని, ప్రభుత్వం స్పందించే వరకు ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని కమల్‌రాజ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత, మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి,సర్పంచ్ లు శీలం రామకోటారెడ్డి, వేల్పుల బెంజిమెన్, కొల్లు శ్రీనివాసరావు,మండల నాయకులు శీలం నారాయణరెడ్డి,,గూడూరు రమణారెడ్డి, శేగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కుడుముల మల్లికార్జున రెడ్డి, బొర్ర నరసింహారావు, యరమల కృష్ణారెడ్డి, కోట శ్రీనివాసరావు, సంక్రాంతి కృష్ణారావు,ే షేక్ బహదూర్ ఖాన్,, బ్రహ్మానందరెడ్డి, వెంకటనర్సిరెడ్డి, తిరుపతిరావు, గద్దల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కాళేశ్వరావు, ,రవి, సీతారామిరెడ్డి, పూర్ణారెడ్డి, మల్లారపు బాలాజీ, వెంకటేశ్వరావు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజుల ప్రజాపాలన భేష్

● కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు, పైడిపల్లి కిషోర్ కుమార్

● కేక్ కట్ చేసి సంబరాలు జరిపిన నాయకులు




బోనకల్, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి): వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రజాపాలన భేష్ అంటూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు, పిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ చేపట్టిన వెయ్యి రోజుల ప్రజాపాలన భేష్ గా ఉన్నదని అన్నారు. ఈ వెయ్యి రోజుల ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క తెలంగాణ ప్రజానీకానికి సుపరిపాలన అందించారని అన్నారు. 25 లక్షల రైతులకు 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద 36 వేల కోట్లు, మహిళలకు 12,167 కోట్ల ఉచిత బస్సు సౌకర్యం, 53 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం, 43 లక్షల కుటుంబాలకు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, ఎస్ హెచ్ జి సభ్యులకు 61 కోట్ల రుణాలు, 1900 కోట్ల పావలా వడ్డీ, 4. 50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు 5 లక్షల ఆర్థిక సహాయం, 80,000 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ, 15.50 లక్షలు కొత్త రేషన్ కార్డులు, 3.38 కోట్ల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత అల్పాహారం, సీఎంఆర్ఎఫ్ ద్వారా 5.18 వేల కుటుంబాలకు సుమారు 2527 కోట్ల రూపాయల సహాయం తెలంగాణ రాష్ట్రంలో సుపరిపాలన అందించి వెయ్యి రోజుల ప్రజాపాలనను పూర్తి చేసుకున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ మీడియా సమావేశంలో ముష్టికుంట్ల సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి భూక్య బాలకృష్ణ, మధిర నియోజకవర్గం గాంధీ పదం కన్వీనర్ పాసంగులపాటి కోటేశ్వరరావు, చొప్పకట్లపాలెం మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేబ్రోలు వెంకటేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ వట్టికుంట రామకృష్ణ, పోటు వెంకటేశ్వర్లు, భాగం నాగేశ్వరరావు, షేక్ దస్తగిరి, గుగులోతు వేణు తదితరులు ఉన్నారు.

# ఏజెన్సీలో ఎస్సీ/ఎస్టీ చట్టం దుర్వినియోగమా..?

● పలు మండలాలలో అమాయకులపైనే కేసులు..! ● రక్షణ కోసం వచ్చిన చట్టం..వేధింపుల ఆయుధంగా మారుతోందా..?

● సరైన విచారణ లేకుండానే ఎఫ్ఐఆర్‌లు..అమాయక కుటుంబాలు కోర్టు చుట్టూ ప్రదక్షణలు..!

● అమాయకుల రక్తంతో న్యాయమా..? ఏజెన్సీలో మహమ్మారిగా తప్పుడు కేసులు...








భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 3.(ప్రజాజ్యోతి) అణగారిన వర్గాలకు రక్షణ కల్పించేందుకు వచ్చిన ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం–1989,ఏజెన్సీ ప్రాంతంలో దుర్వినియోగం అవుతోందనే ఆరోపణలు భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా తీవ్రంగా వినిపిస్తున్నాయి.భూ తగాదాలు,వ్యక్తిగత కక్షలు,రాజకీయ విభేదాలకు ఈ చట్టాన్ని అడ్డం పెట్టుకుని అమాయకులపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎస్సీ,ఎస్టీ కేసులు ఎక్కువగా నమోదు అయిన మణుగూరు,పినపాక మండలాలుగా ఉండటం గమనార్హం.ఫిర్యాదు రాగానే కనీస ప్రాథమిక విచారణ లేకుండా, సీసీటీవీ,సాక్ష్యాధారాలను పరిశీలించకుండా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో రైతులు,కూలీలు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు.ఒకసారి ఈ కేసు నమోదై స్టేషన్ బెయిల్ వచ్చిన, కుటుంబాలు మాత్రం 5 సంవత్సరాల పాటు కోర్టు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు.

**మాట మాట పెరిగితే ఎస్సీ/ఎస్టీ కేసేనా..?**

నిజానికి ఎస్సీ/ఎస్టీ చట్టం ఉద్దేశం దళిత, గిరిజనులపై జరిగే వివక్షను అరికట్టడం. కానీ ఏజెన్సీలో చిన్న మాటా మాటా పెరిగినా "కులం పేరుతో దూషించారని" కేసులు పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.ఈ విషయంలో సుప్రీం కోర్టు సైతం "డీఎస్పీ స్థాయి అధికారితో ప్రాథమిక విచారణ జరిపిన తర్వాతే అరెస్టు చేయాలి" అని స్పష్టమైన గైడ్ లైన్స్ ఇచ్చింది.అయితే క్షేత్రస్థాయి లో ఆ నిబంధనలు పాటించడం లేదని,పై నుంచి ఒత్తిడి వస్తుందనే సాకుతో పోలీసులు హడావుడిగా కేసులు పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.ఎస్సీ/ఎస్టీ చట్టం సెక్షన్ 4 ప్రకారం తప్పుడు కేసు నమోదు చేసిన అధికారిపైనా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా,అది అమలుకు నోచుకోవడం లేదు పలువురు మేధావులు వాపోతన్నారు.

**ఎస్పీ,ఆర్డీఓలతో ప్రతి కేసును సమీక్షించాలి**

ఎస్సీ/ఎస్టీ కేసుల సమస్యకు పరిష్కారం చట్టాన్ని నిర్వీర్యం చేయడం కాదని,దాని అమలులో పారదర్శకత పెంచడమేనని పలువురు వాపోతున్నారు.ప్రతి ఎస్సీ/ఎస్టీ కేసు నమోదుకు ముందు డీఎస్పీ ర్యాంక్ అధికారితో తప్పనిసరిగా ప్రాథమిక విచారణ చేయాలని,తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన వారిపై ఐపీసీ 182, 211 కింద కేసులు నమోదు చేయాలని పలు ప్రముఖులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే జిల్లా స్థాయిలో ఎస్పీ,ఆర్డీఓలతో కూడిన స్క్రూటినీ కమిటీ ప్రతి కేసును సమీక్షించాలని వారు కోరుతున్నారు. చట్టం బాధితులకు రక్షణగా ఉండాలి, కానీ అమాయకుల జీవితాలను నాశనం చేసే ఆయుధంగా మారకూడదని, అధికారులు నిజానిజాలు తెలుసుకుని కేసులు నమోదు చేయాలని ఏజెన్సీ ప్రజలు,పలువురు మేధావులు కోరుతున్నారు.

# సేవ్ పాలిటెక్నిక్.. సేవ్ అవర్ ఫ్యూచర్..

● ఎస్బీటీఈటీ విలీనం వద్దే వద్దు..! ● స్కిల్ యూనివర్సిటీలో విలీనం వద్దు..విద్యార్థుల నినాదం..

● ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన

మణుగూరు, సెప్టెంబర్ 03 (ప్రజాజ్యోతి) : ఎస్బీటీఈటీని స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయవద్దని డిమాండ్ చేస్తూ మణుగూరులో పాలిటెక్నిక్ విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించిన విద్యార్థులు "సేవ్ పాలిటెక్నిక్, సేవ్ అవర్ ఫ్యూచర్" అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేక గుర్తింపు ఉందని, దానిని స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేస్తే తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న విలీన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. పాలిటెక్నిక్ వ్యవస్థను నిర్వీర్యం చేసే ఏ నిర్ణయాన్ని తాము అంగీకరించబోమని వినతి స్పష్టం చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆందోళన విరమింపజేశారు.



## రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్ష పదవికీ రాజీనామా

రంగారెడ్డి , సెప్టెంబర్ 01 ( ప్రజాజ్యోతి)



రంగారెడ్డి జిల్లా మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రంగారెడ్డి జిల్లా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న అనంత నరసింహ మాదిగ రాజీనామా చేసినట్లు గురువారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అనంత నరసింహ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ యొక్క మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిలో అవకాశం వస్తే చేరుతానని తెలిపారు.

## భారత ఆర్థిక వృద్ధి వల్ల ప్రపంచానికి కొత్త అవకాశాలు

మొదటిపేజీ తరువాయి..

పరిస్థితులు, భారత్ ఆర్థిక ప్రగతి, శాంతి–భద్రత వంటి అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం తీవ్ర మార్పులు, అనిశ్చితితో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటోందని అన్నారు. ఆహారం, ఇంధనం, సరఫరా వ్యవస్థల నుంచి దాదాపు ప్రతి రంగంపైనా అంతర్జాతీయ పరిణామాల ప్రభావం పడుతోందని మోదీ పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ తన వేగాన్ని కొనసాగిస్తోందని చెప్పారు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ వృద్ధి కొనసాగడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక ప్రగతి ఇప్పుడు ప్రపంచానికి విశ్వాసాన్ని కలిగించడంతో పాటు కొత్త అవకాశాలకు దారితీస్తోందని మోదీ అన్నారు. ఇక ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు, ఉద్రిక్తతలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై భారత్ వైఖరిని మోదీ మరోసారి స్పష్టం చేశారు. అంతర్జాతీయ వివాదాలకు చర్చలు, దౌత్యం, న్యాయపాలన ఆధారంగా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చియాసియా అయినా ఘర్షణలు త్వరగా ముగిసి శాంతి నెలకొనేందుకు చేపట్టే ప్రయత్నాలకు భారత్, బెల్జియం మద్దతు ఇస్తాయని తెలిపారు. ఉగ్రవాదంపై కూడా ఇరుదేశాలు ఒకే వైఖరిని కలిగి ఉన్నాయని మోదీ చెప్పర్హు. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా నిర్మూలించేందుకు కలిసి పనిచేయడం రెండు దేశాల ఉమ్మడి బాధ్యతగా పేర్కొన్నారు. భారత్, బెల్జియం మధఅయ భవిష్యత్ సహకారంలో క్లీన్ ఎనర్జీ, సురక్షితమైన సరఫరా వ్యవస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి ఇరుదేశాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇది సుస్థిర ఇంధన రంగంలో ద్వైపాక్షిక భాగస్వామ్యానికి మరింత ఊతమిస్తుందని మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కీలక ఖనిజాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగంపైనా ఇరుదేశాలు దృష్టి సారించాయి. ఖనిజాల ప్రాసెసింగ్, రీసైక్లింగ్‌లో సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని తెలిపారు.

# శంభు లింగేశ్వరుడి భూములకు స్కెచ్

**చక చకగా పావులు కదుపుతున్న రాష్ట్ర నాయకుడి అనుచరులు**

**దీర్ఘకాలిక లీజుకు ముమ్మర ప్రయత్నాలు**

**అగ్గువకు 8 ఎకరాలు హస్తగతం చేసుకునేందుకు గేమ్**

**గత పాలనలోనూ గులాబీ పార్టీ నేతల గట్టి ప్రయత్నాలు**

**ఆర్డర్ రాకముందే సర్కారు మార్పు**

**విషయం తెలిసి ఈ ప్రభుత్వంలో లాంగ్ లీజ్ కోసం పార్టీ నేతల పావులు**

**సదాశివపేట పట్టణం నడిబొడ్డున రూ. 90 కోట్ల భూమి**

**కిక్కు మనని ఎండోమెంట్ డిపార్ట్మెంట్**

**భూమిని కాపాడుకుంటేనే ఆదాయం**



సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి: సదాశివపేట పట్టణంలో శంభు లింగేశ్వరుడి ఆలయం భూమికి



రాష్ట్రస్థాయి నాయకుడు వారి అనుచరులు స్కెచ్ వేస్తున్నారు. పట్టణం నడిబొడ్డున 65వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఎకరం రూ. 10 కోట్లకు పలికే విలువైన భూమి కావడంతో అందరి కళ్ళు ఈ భూమిపైనే ఉన్నాయి. ఈ భూమిని దీర్ఘకాలిక లీజుకు తీసుకొని లబ్ధి పొందేందుకు రాష్ట్ర నాయకుడు వారి అనుచరులు చక చకగా పౌలు కదుపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. దాదాపు రూపాయలు 90 కోట్లు విలువైన ఈ భూమికి ఇటీవలే మార్కెట్ వాల్ పెరిగింది. ఈ భూమిని కేవలం లక్షల రూపాయల లీజ్ కు తీసుకునే ప్రయత్నం లోలోపల జరుగుతున్నది.

గత ప్రభుత్వ పాలనలోను గులాబీ పార్టీ నాయకుడు ఒకరు ఈ భూమిని లీజుకు తీసుకునేందుకు గట్టి ప్రయత్నమే చేశారు. ప్రభుత్వం మారడంతో ఆయన లీజు ఫైలు కాస్త మూలన పడింది.

గులాబీ నాయకుడి లీజు తతంగం తెలుసుకున్న ఈ ప్రభుత్వం లోని రాష్ట్ర నాయకులు వారి అనుచరులు శరవేగంగా పావులు కదిపి తామే శంభు లింగేశ్వరుడి ఆలయ భూమిని లీజుకు తీసుకునేందుకు గట్టి ప్రయత్నమే మొదలెట్టారు.

తుల్జాబాగ్ ధర్మశాల పేరుతో దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఈ భూమిని లీజుకు ఇచ్చే విధి విధానాలను సానుకూలంగా మలుచుకునే ప్రయత్నంలో భాగంగా లీజుకు ఇవ్వాల్సిన సంబంధిత శాఖల అధికారులను నయానో భయానో ఒప్పించుకున్నట్టు మార్కెట్లో ప్రచారం జోరుగా సాగుతున్నది.

తుల్జాబాగ్ ధర్మశాల పేరిట హైదరాబాద్ నడిబొడ్డున, ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వందల కోట్ల విలువచేసే భూములు ఉన్నాయి. సదాశివపేట పట్టణంలో సైతం తుల్జాబాగ్ ధర్మశాలకు చెందిన భూములు, భవనాలు, దేవాలయాలు, పురాతన కట్టడాలు, బావులు ఉన్నాయి.

సదాశివపేట పట్టణంలోని శంభు లింగేశ్వరుడి మాన్యం భూమిని దీర్ఘకాలిక లీజుకు పేరుతో తమ ఆధీనంలోకి తీసుకోవాలనేది రాజకీయ పార్టీల నేతల ప్రయత్నం.

అదే జరిగితే పట్టణం నడిబొడ్డున దేవాదాయ శాఖ భూముల్లో షాపింగ్




మాల్స్, ఏసీ ఫంక్షన్ హాల్స్, భారీ కన్వెన్షన్ హాల్స్, భారీ సూపర్ మార్కెట్లు ప్రారంభం అయ్యే అవకాశం ఉన్నది. దేవాదాయ శాఖ పరిధిలోను కళ్యాణ మండపాలు భక్తుల విడిది కేంద్రాలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చుకునే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆ ఆలోచన చేయడం లేదు. దేవాదాయశాఖకు చెందిన శంభులింగేశ్వర ఆలయం భూములు లీజుకి ఇస్తే అడ్డుకుంటామని భక్తులు హెచ్చరిస్తున్నారు.

## జన్మాష్టమి వేళ దయల్ బాగులో ఆధ్యాత్మిక సందడి

### హుజూర్ స్వామీజీ మహారాజ్ జయంతి సందర్భంగా పవిత్ర బండార

ఆగ్రా, సెప్టెంబర్ 4, ( ప్రజా జ్యోతి ):

దయాల్‌బాగ్, ఆగ్రా: రాధాస్వామి మత ప్రవర్తకులు, మొదటి సంత్ సత్‌గురువుగా భావించే పరమ పురుష్ పూరన్ ధనీ హుజూర్ స్వామీజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని పవిత్ర భండారా ఉత్సవాన్ని సెప్టెంబర్ 4న జన్మాష్టమి రోజున దయాల్‌బాగ్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. హుజూర్ స్వామీజీ మహారాజ్ 1818 ఆగస్టు 24–25 మధ్య పవిత్ర జన్మాష్టమి రాత్రి ఆగ్రాలోని పన్నీ గలీలో సేఠ్ శివ్ దయాల్ సింగ్ జీగా అవతరించినట్లు రాధాస్వామి సత్సంగ వర్గాలు పేర్కొంటున్నాయి. జీవుల ఆధ్యాత్మిక ఉద్ధరణకు ప్రత్యక్ష మార్గంగా సూరత్–శబ్ద–యోగాన్ని బోధించి, 1861 ఫిబ్రవరి 15న వసంత పంచమి రోజున సర్వసాధారణ సత్సంగీయులకు రాధాస్వామి సత్సంగ ద్వారాలను తెరిచినట్లు తెలిపారు. భండారా ఉత్సవాలు సెప్టెంబర్ 2 నుంచి 6 వరకు కొనసాగనున్నాయి. సెప్టెంబర్ 4న దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల్లోని అనుమతించబడిన శాఖల్లోనూ ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిశా తదితర రాష్ట్రాలతో పాటు యూరప్ నుంచి సత్సంగీ సోదర సోదరీమణులు, నమోదైన జిజ్ఞాసువులు దయాల్‌బాగ్‌కు హాజరుకానున్నారు. పవిత్ర గురు పరంపరలో అత్యంత పూజ్య హుజూర్ ప్రొఫెసర్ ప్రేమ్ సరన్ సత్సంగీ సాహబ్ దయాల్‌బాగ్ ఎనిమిదవ, ప్రస్తుత వక్త సంత్ సత్‌గురువుగా కొనసాగుతున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 4న ఉదయం పవిత్ర హారతి, అనంతరం రెండవ సెషన్‌లో పొలాల్లో పవిత్ర భండారా నిర్వహించనున్నారు. ఆధ్యాత్మికత, సేవ, సాదా జీవనం, విద్య, వ్యవసాయం, సహకార సమాజ జీవన విధానాల సమ్మేళనంతో దయాల్‌బాగ్ కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆందోళన..

మొదటిపేజీ తరువాయి..

వెల్లి లేఖలు ఉంచాలని ప్రయత్నించారు. విద్యార్థుల గొంతు వినిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఐతే.. పోలీసులు అడ్డుకొని ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆయనతోపాటూ.. కొందరు బీజేపీ నాయకులు, కార్యకర్తలను కూడా అదుపులోకి తీసుకొని.. అక్కడి నుంచి తరలించారు. ఈ సమస్య రాన్రానూ తీవ్రం అవుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తేవడానికి ఉద్దేశించినది. బీజేపీ అంచనా ప్రకారం బకాయిలు రూ.12,000 నుంచి 15,000 కోట్ల వరకు పెరిగాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలోనూ కొంత బకాయి ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం కాలంలో మరింత పెరిగిందని వారు చెబుతున్నారు. దీని ఫలితంగా అనేక ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల అసలు సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నాయి. స్టాఫ్ జీతాలు ఆలస్యమవుతున్నాయి. కొన్ని కళాశాలలు మూతపడే పరిస్థితి వచ్చిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

# టీచర్ల కొరతతో కుంట్లూరు హైస్కూల్ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం!

**350 మందికి పైగా విద్యార్థులకు.. ఏడుగురు టీచర్లే**

**ప్రతి తరగతిలో 70–80 మంది.. బోధనపై తీవ్ర ప్రభావం**

**మరో ఐదుగురు ఉపాధ్యాయులు, పీఈటీ.. వాచ్‌మెన్ నియామకానికి డిమాండ్**

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 01 ( ప్రజాజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో మాత్రం నీరుగారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని కుంట్లూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న పరిస్థితులు ఇందుకు నిదర్శనంగా మారాయి. వందలాది మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండటంతో విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రతికూల ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వందలాది మంది విద్యార్థులకు ఏడుగురు టీచర్లే!

పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియంలో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఉన్న కొద్దిమంది టీచర్లపైనే బోధన భారం పడుతోంది. ప్రస్తుతం కేవలం ఏడుగురు ఉపాధ్యాయులతోనే విద్యాబోధన కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.దీంతో ప్రతి ఉపాధ్యాయుడిపై అదనపు పనిభారం పడటమే కాకుండా, విద్యార్థులకు అవసరమైన వ్యక్తిగత శ్రద్ధ అందడం కష్టంగా మారింది.

### ఒక్కో తరగతిలో 70–80 మంది

పాఠశాలలోని తరగతి గదుల్లో విద్యార్థుల సంఖ్య భారీగా ఉంది. ఒక్కో తరగతిలో సుమారు 70 నుంచి 80 మంది వరకు విద్యార్థులు ఉండటంతో బోధన ప్రక్రియ సవాల్‌గా మారింది. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే తరగతి గదిలో బోధన చేయడం వల్ల విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం, ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక దృష్టి



సారించడం ఉపాధ్యాయులకు కష్టతరంగా మారుతోంది.

### డిప్యూటేషన్ టీచర్లపైనే ఆధారం

గత విద్యా సంవత్సరంలో డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు ఉపాధ్యాయులు——ఫిజిక్స్, మ్యాథ్స్ టీచర్లు——పాఠశాల బోధనా వ్యవస్థకు కొంతమేర ఊరటనిచ్చారు.అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా శాశ్వతంగా సరిపడా ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### మరో ఐదుగురు టీచర్లు.. పీఈటీ అత్యవసరం

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, తరగతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరో ఐదుగురు ఉపాధ్యాయులను నియమించడంతో పాటు పీఈటీని కూడా నియమించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. ముఖ్యంగా హైస్కూల్ స్థాయిలో గణితం, సైన్స్, ఇంగ్లిష్ తదితర సబ్జెక్టుల బోధనకు తగినంత మంది ఉపాధ్యాయులు అందుబాటులో ఉండటం అత్యవసరమని వారు పేర్కొంటున్నారు.

### శిథిలావస్థలో మరుగుదొడ్లు.. విద్యార్థులకు అవస్థలు

విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేవన్న ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలోని మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బాలికలకు పరిశుభ్రమైన, సురక్షితమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉండటం అత్యంత అవసరం. ఈ సమస్యపై అధికారులు తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

### అసంపూర్తిగా కిచెన్ షెడ్.. మధ్యలోనే పనులు

పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమాచారం. ప్రారంభించిన పనులను పూర్తి చేయకుండా వదిలేయడం వల్ల ప్రభుత్వ నిధులు, ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు కిచెన్ షెడ్ నిర్మాణాన్ని పరిశీలించి, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయించాలని కోరుతున్నారు.




### పాఠశాల సామాగ్రికి రక్షణ కరువు

దాతల ద్వారా సేకరించి పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌కు అమర్చిన మోటర్, తరగతి గదుల్లో విద్యాబోధనకు ఉపయోగించే టీవీలకు సంబంధించిన బ్యాటరీలు తరచూ చోరీకి గురవుతున్నట్లు హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. పాఠశాలకు వాచ్ మెన్ లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుందని ఆయన తెలిపారు.దీంతో విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలు అందకుండా పోతున్నాయి. పాఠశాలలో విలువైన సామాగ్రి ఉన్నప్పటికీ వాటి రక్షణకు వాచ్‌మెన్ లేకపోవడంతో భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

### చదువుల ఆలయం.. సమస్యల నిలయంగా మారొద్దు

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సమానంగా నాణ్యమైన విద్య, మౌలిక వసతులు పొందే హక్కు కలిగి ఉన్నారు. కానీ కుంట్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత నుంచి మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, తాగునీరు, భద్రత వరకు పలు సమస్యలు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది.

### కలెక్టర్.. విద్యాశాఖ అధికారులు స్పందించాలి

కుంట్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని సమస్యలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన మరో ఐదుగురు ఉపాధ్యాయులు, పీఈటీని నియమించడంతో పాటు శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లను పునరుద్ధరించాలని, అసంపూర్తిగా ఉన్న కిచెన్ షెడ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, వాచ్‌మెన్‌ను నియమించి పాఠశాల సామాగ్రికి భద్రత కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

### టీచర్ల కొరతతో ప్రభుత్వ బడులపై నిరుపేదల ఆశలు ఆవిరి

విద్యార్థుల సంఖ్యకు తగినంతగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యా ప్రమాణాలపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాల ఫీజుల భారం భరించలేక ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందన్న ఆశతో పిల్లలను చేర్పిస్తున్న నిరుపేద తల్లిదండ్రులకు నిరాశ ఎదురవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల విద్యా ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. జిల్లాలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి అవసరానికి మించి ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ హైస్కూల్ లను అధికారులు గుర్తించి అక్కడి నుంచి ఉపాధ్యాయులను కుంట్లూర్ హై స్కూల్ కు సర్దుబాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఫలితంగా విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన అందడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులు స్పందించేనా? విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే కుంట్లూర్ ప్రభుత్వ హై స్కూల్ ను పరిశీలించి ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. మరి అధికార యంత్రాంగం ఈ సమస్య పరిష్కారానికి ఏం చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి మరి.







Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967